ఆంధ్రజ్యోతి

ANDHRAJYOTHY



డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ **కోనసీమ** జిల్లా వార్తలు

సోమవారం 28 అక్టోబరు 2024 | 7



మహారాష్ట్ర నుంచి వచ్చిన బృందం

వార్తలు..9లో

వాడపల్లి వెంకన్న బ్రహ్మోత్సవాలు అంగరంగ వైభవంగా జరుగుతున్నాయి..ఆదివారం సాంస్కృతిక కార్యక్రమాలు ప్రత్యేక ఆకర్షణగా నిలిచాయి. వారణాసి నుంచి వచ్చిన అఘోరాల ప్రదర్శన హైలెట్‌గా నిలిచింది..

అఘోరాల ప్రదర్శన



నేడు మలికిపురంలో గ్రీవెన్స్

హాజరుకానున్న కలెక్టర్ మహేష్‌కుమార్

అమలాపురం టౌన్, అక్టోబరు 27(ఆంధ్రజ్యోతి): మలికిపురం మండల పరిషత్ అభివృద్ధి అధికారి కార్యాలయంలో సోమవారం ప్రజా సమస్యల పరిష్కార వేదిక నిర్వహిస్తున్నట్టు కలెక్టర్ ఆర్.మహేష్‌కుమార్ ఒక ప్రకటనలో తెలిపారు. మండల స్థాయిలో ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదికలో కలెక్టర్‌తో పాటు అమలాపురం ఆర్డీవో కార్యాలయ అధికారులు పాల్గొంటారని తెలిపారు. మండల పరిధిలోని అర్జీదారులు తమ సమస్యలను డివిజన్ స్థాయి అధికారుల దృష్టికి తీసుకువచ్చి పరిష్కార మార్గాలు పొందాలని విజ్ఞప్తి చేశారు.

కలెక్టరేట్‌లో నేడు యథావిధిగా మీకోసం..

జిల్లాస్థాయి ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదిక (మీకోసం) కార్యక్రమం సోమవారం కలెక్టరేట్‌లోని గోదావరి భవన్‌లో ఉదయం 10 గంటల నుంచి జాయింట్ కలెక్టర్ టి.నిషాంతి ఆధ్వర్యంలో యథావిధిగా జరుగుతుందని కలెక్టర్ కార్యాలయం ఒక ప్రకటనలో తెలిపింది. అర్జీదారులు తమ సమస్యలను జిల్లా యంత్రాంగం దృష్టికి తీసుకువచ్చి పరిష్కార మార్గాలు పొందాలని విజ్ఞప్తి చేసింది..



అపార్‌తో ప్రయోజనాలు

కేంద్ర ప్రభుత్వం విద్యా విధానాల్లో మార్పులు తీసుకువస్తోంది. దీనిలో భాగంగా కేజీ నుంచి పీజీ వరకు చదివే ప్రతి విద్యార్థికి గుర్తింపు సంఖ్యను వన్ నేషన్ వన్ స్టూడెంట్ గుర్తింపు పేరిట అపార్ కార్డు ఇవ్వాలని నిర్ణయించింది. ఇందుకు సంబంధించిన ప్రక్రియను ప్రభుత్వ, ప్రైవేటు పాఠశాలలు ప్రారంభించాయి. పాఠశాలల్లో చదివే విద్యార్థుల తల్లిదండ్రులకు కార్డు ప్రయోజనాలను వివరించడంతో వారు సమ్మతి పత్రాలు ఇవ్వడానికి ముందుకు వస్తున్నారు.

రాయవరం, అక్టోబరు 27(ఆంధ్రజ్యోతి):

- స్కాన్ చేస్తే విద్యార్థి పూర్తి వివరాలు
- తొలిసారిగా తొమ్మిది, పది విద్యార్థులకు అమలు

కార్డులో ఉండే వివరాలు

ప్రతి విద్యార్థికి అందించే అపార్‌కార్డు (ఆటోమెటిక్ పర్మినెంట్ అకాడమిక్ అకౌంట్ రిజిస్ట్రీ) ఇవ్వనుండగా ఈకార్డులో విద్యార్థి పేరు, పుట్టినతేదీ, లింగం, ఫొటో, క్యూఆర్ కోడ్ గుర్తింపు సంఖ్య ఉంటుంది. అకడమిక్ సమాచారంతో పాటు విద్యార్థి సాధించిన ఫలితాలు, ఇతర విద్యా సమాచారం పొందుపరుస్తారు. క్యూఆర్ కోడ్ లేదా ఆన్‌లైన్ నంబరు స్కాన్ చేస్తే విద్యార్థి పూర్తి సమాచారం కనబడుతుంది. విద్యార్థి ఒక విద్యాసంస్థ నుంచి మరో విద్యాసంస్థకు మారినప్పుడు ఎలాంటి సమస్యలు ఉత్పన్నం కాకుండా ఉండేందుకు అపార్ కార్డు ఉపయోగపడుతుంది. అపార్‌లో విద్యార్థి ప్రోగ్రెస్, ఉపకార వేతనాలు, రివార్డులు తెలుసుకోవడం సులభతరం. విద్యార్థులకు ప్రభుత్వం అందజేసే పథకాలు, ప్రయోజనాలు పొందడానికి ఉపకరిస్తుంది.



అపార్ అందించేందుకు సన్నాహాలు

మండలంలోని 12 గ్రామాల్లో ఉన్న ప్రభుత్వ, ప్రైవేటు పాఠశాలల్లో చదువుతున్న 7వేల 772 మంది విద్యార్థులకు అపార్ కార్డును అందజేసేందుకు సన్నాహాలు జరుగుతున్నాయని ఎంఈవో వై.సూర్యనారాయణ తెలిపారు. బహుళ ప్రయోజనాలు గల అపార్ కార్డును తొలుత తొమ్మిది, పదో తరగతి చదువుతున్న విద్యార్థులకు అందజేయనున్నారు. తర్వాత కేజీ నుంచి పీజీ వరకు చదివే విద్యార్థులకు అపార్ అందించేందుకు కసరత్తు జరుగుతుంది. ఇప్పటికే అపార్‌పై ప్రభుత్వ, ప్రైవేటు పాఠశాలల్లో విద్యార్థులకు అపార్ అందించేందుకు విద్యార్థుల తల్లిదండ్రులకు అవగాహన కల్పిస్తున్నారు. విద్యార్థుల నుంచి సమ్మతి పత్రాలను ప్రభుత్వ ప్రైవేటు పాఠశాలల విద్యార్థుల నుంచి హెచ్‌ఎంలు సేకరిస్తున్నారు.

> బహుళ ప్రయోజనాలు గల ఈ అపార్ కార్డులు విద్యార్థులకు అందించేందుకు గాను విద్యార్థుల వివరాలు వెబ్‌సైట్‌లో నమోదు చేసే ప్రక్రియ వేగవంతం చేశాం. ఈ అపార్ కార్డుతో విద్యార్థులు ఒక పాఠశాల నుంచి మరో పాఠశాలకు వెళ్లిన సమయంలో విద్యార్థి పూర్తి వివరాలు క్యూఆర్ కోడ్ స్కాన్ చేస్తే ఆన్‌లైన్‌లో వస్తాయి.
>
> **వై.సూర్యనారాయణ ఎంఈవో, రాయవరం**

'గుర్తింపు' పొందిన ఓపెన్ డిగ్రీలు ఓటు హక్కుకు అర్హమైనవే

ముమ్మిడివరం, అక్టోబరు 27(ఆంధ్రజ్యోతి): జీవోలకు అనుగుణంగా పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికలకు ఓట్లు నమోదు చేసే విధంగా జిల్లాలోని తహసీల్దార్లు చర్యలు తీసుకోవాలని ఆదివారం కలెక్టర్ కార్యాలయం ఒక ప్రకటనలో తెలిపింది. ఓపెన్ డిగ్రీ చేసిన వారి ఓటు దరఖాస్తులు కొందరు తహసీల్దార్లు తిరస్కరిస్తున్న నేపథ్యంలో ఆంధ్రజ్యోతిలో 'మాకు ఓటు హక్కు లేదా' శీర్షికన ప్రచురితమైన వార్తా కథనానికి కలెక్టర్ కార్యాలయం స్పష్టత ఇచ్చింది. గుర్తింపు పొందిన అన్ని యూనివర్సిటీలు జారీ చేసిన రెగ్యులర్ డిగ్రీలతో పాటు ఓపెన్ డిగ్రీలు కూడా ఓటు హక్కు నమోదుకు అర్హమైనవని పేర్కొంది. ఈ ఏడాది నవంబరు 1 నాటికి మూడేళ్ల ముందుగా పట్టభద్రులు అయి ఉండి, జీవోఎంఎస్ నంబరు 536 జీఏడీ (ఎలక్షన్ ఎఫ్) 2006 సెప్టెంబరు 28 ప్రకారం గుర్తింపు పొందిన అన్ని విశ్వవిద్యాలయాలు, డీమ్డ్ యూనివర్సిటీలు, జీవోఎంఎస్ నంబరు 22జీఏడీ (ఎలక్షన్ ఈ) 2011 జనవరి 17 ప్రకారం ఇందిరాగాంధీ నేషనల్ ఓపెన్ యూనివర్సిటీ (న్యూఢిల్లీ) నుంచి డిగ్రీ పొందినవారు అర్హులని పేర్కొన్నారు. జీవోలకు అనుగుణంగా తహసీల్దార్లు, ఎమ్మెల్సీ ఎన్నికలకు ఓటర్ల జాబితాలో పట్టభద్రులకు ఓటు హక్కు కల్పించాలని ఆ ప్రకటనలో పేర్కొన్నారు.

దళారులను నమ్మి మోసపోవద్దు



జిల్లాలో 370 ధాన్యం కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు

నవంబరు 6 నుంచి కొనుగోళ్లు ప్రారంభం: జేసీ నిషాంతి

అమలాపురం, అక్టోబరు 27(ఆంధ్రజ్యోతి): దళారులు, మధ్యవర్తులను నమ్మి మోసపోకుండా రాష్ట్ర ప్రభుత్వం రైతులకు కనీస మద్దతు ధర కల్పిస్తుందని జాయింట్ కలెక్టర్ టి.నిషాంతి పేర్కొన్నారు. జిల్లాలో 370 రైతు సేవా కేంద్రాల ద్వారా ధాన్యం కొనుగోళ్లు నవంబరు 6 నుంచి ప్రారంభిస్తామన్నారు. 2024-25 ఖరీఫ్‌లో రైతులు పండించిన ధాన్యానికి నాణ్యతా ప్రమాణాలకు లోబడి మద్దతు ధర కల్పిస్తామన్నారు. గతంలో ఉన్న ర్యాండమైజేషన్ ప్రస్తుతం లేదని, రైతులు తమకు నచ్చిన రైసు మిల్లులకు ధాన్యాన్ని తరలించుకుని విక్రయించుకునే వెసులుబాటు కల్పించారన్నారు. ఖరీఫ్‌లో సాధారణ రకం క్వింటా ధాన్యానికి రూ.2300, 75 కిలోలకు రూ.1725, గ్రేడ్-ఏ రకం క్వింటా ధాన్యం రూ.2320, 75 కిలోల ధాన్యం రూ.1740 ధరగా ప్రభుత్వం నిర్ణయించిందన్నారు. ధాన్యం కొనుగోలు సమయంలో ప్రతీ దశలోను ఐదు పర్యాయాలు రైతుల మొబైల్ ఫోన్లకు సంక్షిప్త సందేశాలు పంపిస్తామన్నారు. ధాన్యాన్ని ప్రభుత్వానికి విక్రయించాల్సిన తేదీ, సమయంతో కూడిన కూపన్‌ను రైతులకు అందజేస్తారన్నారు. నిర్దేశించిన తేదీన సాంకేతిక నిపుణుడు రైతుల కళ్లాల వద్దకు ధాన్యం నమూనాలను సేకరించి కేంద్ర ప్రభుత్వం నిర్దేశించిన నాణ్యతా ప్రమాణాలను విశ్లేషిస్తారన్నారు. నాణ్యతా ప్రమాణాలకు లోబడి ఉన్నట్టయితే ధాన్యం కొనుగోలు చేస్తారన్నారు. రైతుల నుంచి బయోమెట్రిక్ వేలి ముద్రలు తీసుకుంటారని, ధాన్యం వివరాలతో కూడిన రశీదు రైతులకు అందజేస్తారన్నారు. సేకరించిన ధాన్యాన్ని రైతు కోరిన రైసుమిల్లుకు జీపీఎస్ కోఆర్డినేట్స్‌తో కూడిన వాహనాల్లో రవాణా చేస్తారని చెప్పారు. రైతు ఆధార్ లింక్ అయిన బ్యాంకు ఖాతాకు నేరుగా సొమ్ము జమ చేస్తామన్నారు. రైతులకు బహిరంగ మార్కెట్‌లో తాము పండించిన ధాన్యానికి అధిక ధర లభించినట్టయితే అమ్ముకోవచ్చునని, ధాన్యం పరిమాణ వివరాలను సంబంధిత రైతు సేవా కేంద్రాల్లో తప్పనిసరిగా నమోదు చేయాలని జేసీ నిషాంతి సూచించారు.



పీహెచ్‌సీల ద్వారా

104 సేవలను కొనసాగించాలి

అమలాపురం టౌన్, అక్టోబరు 27(ఆంధ్రజ్యోతి): 104 అంబులెన్సు సేవలను ప్రభుత్వం ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల ద్వారా నిర్వహించాలని యూనియన్ రాష్ట్ర కార్యదర్శి కె.ఓంప్రకాష్, జిల్లా ప్రధాన కార్యదర్శి పి.త్రిమూర్తులు పేర్కొన్నారు. అమలాపురం యూటీఎఫ్ హోంలో పి.చంద్రశేఖర్ అధ్యక్షతన 104 ఉద్యోగుల సమావేశం ఆదివారం నిర్వహించారు. గత 16 ఏళ్లుగా సేవలు అందిస్తున్న జిల్లాలోని 326 మందిని వైద్య ఆరోగ్య, ఇతర శాఖల్లో కాంట్రాక్టు డ్రైవర్లుగా నియమించాలని డిమాండ్ చేశారు. ఉద్యోగ భద్రత కల్పించి సమాన పనికి సమాన వేతనం చెల్లించాలని, రిటైర్మెంట్ వయసును 62 ఏళ్లకు పెంచాలన్నారు. ఖాళీలను భర్తీ చేయడంతో పాటు పీఏ, డీఏలు చెల్లించాలన్నారు. సమావేశంలో ఉపాధ్యక్షురాలు ఎల్.రాజకుమారి, ఎం.జగ్జీవన్‌రామ్, యూటీఎఫ్ జిల్లా అధ్యక్షుడు పెంకే వెంకటేశ్వరరావు, సీఐటీయూ జిల్లా ప్రధాన కార్యదర్శి నూకల బలరామ్‌పాల్గొన్నారు

జగన్ ప్రభుత్వ హయాంలో జరిగిన హత్య కేసులపై

పునర్విచారణ జరగాలి

విదసం ఐక్యవేదిక రాష్ట్ర సమితి సమన్వయకర్త డాక్టర్ వెంకటరావు

డ్రైవర్ సుబ్రహ్మణ్యం, కోడి కత్తి శ్రీను కేసుల్లో న్యాయం జరగాలి

విదసం రాష్ట్ర సమితి సమావేశంలో వక్తల డిమాండ్



మాట్లాడుతున్న రాష్ట్ర సమితి సమన్వయకర్త డాక్టర్ వెంకటరావు

అమలాపురం టౌన్, అక్టోబరు 27(ఆంధ్రజ్యోతి): ప్రస్తుత ఎమ్మెల్యే రఘురామకృష్ణంరాజు.. సినీ నటి జెత్వానీ కేసుల మాదిరిగానే గత జగన్ ప్రభుత్వంలో రాష్ట్రంలో జరిగిన సంచలన హత్యలు, కేసులు పునర్విచారణ చేపట్టాలని విస్తృత దళిత సంఘాల ఐక్యవేదిక (విదసం) రాష్ట్రసమితి సమన్వయకర్త డాక్టర్ బూసి వెంకటరావు డిమాండ్ చేశారు. దళితులపై జరిగిన ఘటనలపై పునర్విచారణ జరిపించాలన్నారు. వీడీఎస్‌యూ రాష్ట్ర ఉపాధ్యక్షుడు, ఐక్యవేదిక రాష్ట్ర కోకన్వీనర్ రేవు తిరుపతిరావు అధ్యక్షతన ఆదివారం ఈదరపల్లిలోని సామాజిక భవనంలో విదసం రాష్ట్ర సమితి సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ముఖ్య అతిథిగా హాజరైన డాక్టర్ వెంకటరావు మాట్లాడుతూ వైసీపీ ప్రభుత్వంలో దళితులపై సాగించిన హత్యాకాండలు, అక్రమ కేసులను ముఖ్యమంత్రి చంద్రబాబు దృష్టికి తీసుకువెళ్లేందుకు తీర్మానించామన్నారు. తొలుత బాధిత కుటుంబ సభ్యులు తమకు జరిగిన అన్యాయాలను వివరిస్తూ బ్యానర్లతో ప్రదర్శన నిర్వహించారు. విశాఖపట్నంలో అప్పటి ముఖ్యమంత్రి జగన్‌పై జరిగిన దాడి కేసులో ఎన్ఐఏ దర్యాప్తు సంస్థ టెర్రరిస్టు, ప్రత్యర్థి రాజకీయ కుట్రలు లేవని స్పష్టం చేసినందున కేసును ఎన్ఐఏ యాక్టు, క్లాజ్ నంబరు 7బి ప్రకారం ఏపీ పోలీసులకు బదిలీ చేయవచ్చునన్నారు. ఈ సందర్భంగా కోడి కత్తి శ్రీను, సోదరుడు సుబ్బరాజుతో కలిసి తల్లి జనుపల్లి సావిత్రి మాట్లాడుతూ తన కొడుకును అన్యాయంగా జగన్ ఐదేళ్లు జైలులో పెట్టారని, సీఎం చంద్రబాబు ఇచ్చిన హామీ మేరకు రాష్ట్ర ప్రభుత్వం సహాయంచేసి కేసును ఏపీ పోలీసులకుగానీ, సీబీఐకి గానీ బదిలీచేసి సత్వర విచారణ జరిపి న్యాయం చేయాలని కోరారు. ఎమ్మెల్సీ అనంతబాబు తన డ్రైవరు వీధి సుబ్రహ్మణ్యంను అత్యంత దారుణంగా కొట్టి చంపారని పిట్టా వరప్రసాద్ వివరించారు. జగన్ మద్దతుతోనే అనంతబాబుకు బెయిల్ వచ్చిందని ఆరోపించారు. సుబ్రహ్మణ్యం తల్లి నూకరత్నం మాట్లాడుతూ తన కొడుకు హత్యలో అనంతబాబు భార్య ఇతరులు కూడా ఉన్నారని, దీనిపై కోర్టులో మెమో వేసి కేసును పునఃసమీక్ష చేయాలని డిమాండ్ చేశారు. అనంతబాబు బెయిల్‌ను రద్దుచేసేలా సుప్రీంకోర్టులో పిటిషన్ వేయాలన్నారు. వెంకటాయపాలెం శిరోముండనం కేసుపై గుబ్బల శ్రీను మాట్లాడుతూ ప్రస్తుత ఎమ్మెల్సీ తోట త్రిమూర్తులు దోషి అని నిర్ధారణ అయిందన్నారు. మూడేళ్లకు పైబడి శిక్ష పడాల్సిన కేసులో కోర్టు కేవలం 18 నెలలు జైలు శిక్ష మాత్రమే విధించిందన్నారు. ఆ శిక్షను కూడా రద్దు చేయాలని త్రిమూర్తులు హైకోర్టులో అప్పీల్ చేశారని, ప్రస్తుతం బెయిల్‌పై ఉండి కేసు నుంచి తప్పించుకునేందుకు జనసేనలో దూకే ప్రయత్నంలో ఉన్నట్టు ఆరోపించారు. కూటమి ప్రభుత్వం స్పందించి తక్షణం క్రాస్ అప్పీల్ వేసి త్రిమూర్తులుకు విధించిన శిక్షను పునఃసమీక్ష చేయాలని డిమాండు చేశారు. గోపాలపురం హోటల్‌లో పేపరు ప్లేట్లపై అంబేడ్కర్ బొమ్మవేసిన కేసుపై వాసు మాట్లాడుతూ హోటల్ యజమానిపై ఫిర్యాదు చేసేందుకు వెళ్లిన దళిత యువకులపై అప్పటి ఎమ్మెల్యే చిర్ల జగ్గిరెడ్డి ఆదేశాల మేరకు పోలీసులు 120బి సెక్షన్‌తో కేసు నమోదు చేసి 15 రోజులు రిమాండ్‌కు పంపించారని ఆరోపించారు. రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బీఆర్ అంబేడ్కర్‌ను అవమానించిన హోటల్ యజమాని వెంకటరెడ్డిపై ఇప్పటికీ కేసు నమోదు చేయలేదన్నారు. కక్ష సాధింపుతో ఫిర్యాదుదారులపైనే తప్పుడు కేసులు పెట్టించారని ఈ ఘటనపై ప్రభుత్వం పునర్విచారణ జరిపించాలని డిమాండ్ చేశారు. సమావేశంలో విదసం నాయకులు ఓంకార్, ప్రసాద్, దళిత సంఘాల ఐక్యవేదిక నాయకులు జంగా బాబూరావు, ఇసుకపట్ల రఘుబాబు, అయితాబత్తుల ఉమామహేశ్వరరావు, కొంకి రాజామణితో పాటు వివిధ సంఘాల నాయకులు కొండా దుర్గారావు, నాగాబత్తుల ప్రసాదరావు, దేవరపల్లి శాంతికుమార్, శెట్టిబత్తుల తులసీరావు, నాగాబత్తుల నరసింహమూర్తి, నెల్లి ప్రసాద్, అమలదాసు బాబూరావు తదితరులు పాల్గొన్నారు.



ఏపీ పోలీసులతో దర్యాప్తు చేయించాలని కోరుతున్న కోడి కత్తి శ్రీను కుటుంబం

పంచాయతీరాజ్ ఇంజనీర్స్ అసోసియేషన్స్ జిల్లా అధ్యక్షుడిగా వీరభద్రరావు



పంచాయతీరాజ్ ఇంజనీర్స్ అసోసియేషన్ జిల్లా నూతన కార్యవర్గం

అమలాపురం టౌన్, అక్టోబరు 27(ఆంధ్రజ్యోతి): పంచాయతీరాజ్ ఇంజనీర్స్ అసోసియేషన్స్ జిల్లాశాఖ అధ్యక్షుడిగా డి.వీరభద్రరావు ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. ఆర్అండ్‌బీ సమావేశ మందిరంలో ఆదివారం పంచాయతీరాజ్ డిప్లమో ఇంజనీర్ల జిల్లా కార్యవర్గ సమావేశం నిర్వహించారు. అసోసియేషన్ కార్యదర్శి కె.రమేష్ ఎన్నికల అధికారిగా వ్యవహరించారు. జిల్లాశాఖ ప్రధాన కార్యదర్శిగా వి.రమేష్‌కుమార్, ఉపాధ్యక్షుడిగా పీఎస్ రాజ్‌కుమార్, కోశాధికారిగా ఎంఎస్ఎల్ సంధ్య, ఆర్గనైజింగ్ కార్యదర్శిగా కేవీవీ సత్యనారాయణతో పాటు కార్యవర్గ సభ్యులను ఎన్నుకున్నారు. యూనియన్ రాష్ట్ర అధ్యక్షుడు కె.రవీంద్ర ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడుతూ ప్రస్తుతం కూటమి ప్రభుత్వంలో ఉపాధి హామీ నిధులతో చేపట్టిన సీసీ రోడ్లు, ఇతర అభివృద్ధి పనులను ఇంజనీరింగ్ అసిస్టెంట్ల సహాయంతో పూర్తి నాణ్యతా ప్రమాణాలతో పూర్తి చేయాలని సూచించారు. రాష్ట్ర ఆర్గనైజింగ్ కార్యదర్శి అన్యం రాంబాబుతో పాటు పలువురు నూతన కార్యవర్గాన్ని అభినందించి సత్కరించారు.

నేడు ప్రజాదర్బార్

ఆలమూరు, అక్టోబరు 27: ప్రజా సమస్యల పరిష్కారంలో భాగంగా కొత్తపేట నియోజకవర్గంలోని మండలాల వారీగా ఎమ్మెల్యే బండారు సత్యానందరావు అధ్వర్యంలో ఏర్పాటు చేస్తున్న ప్రజాదర్బార్‌ను ఈనెల 28న ఆలమూరులో ఏర్పాటు చేశారు. ఈ ప్రజాదర్బార్‌లో వివిధ సమస్యలకు సంబంధించిన అంశాలపై ఫిర్యాదులు ఎమ్మెల్యే సత్యానందరావు నేరుగా ఫిర్యాదులో స్వీకరిస్తారని ఎంపీడీవో కె.జాన్‌లింకన్ తెలిపారు. సోమవారం ఉదయం 10 గంటలకు జరిగే ప్రజాదర్బార్‌కు మండలంలోని పంచాయతీ కార్యదర్శులు, మండల అధికారులు విధిగా హాజరు కావాలని కోరారు.



సరిపోదా ఆదివారం!

కాకినాడ సండే బజారు.. తెల్లవారుజాము 4 గంటల నుంచే సందడి

గుండు సూది నుంచి గునపం వరకు.. కొత్తవి, పాతవి అన్నీ ఒకేచోట దొరికే మార్కెట్

ఎలక్ట్రానిక్స్, గృహోపకరణాలు, సైకిళ్లు.. అబ్బో ఇలా చాలా.. అన్నీ కారుచౌక ధరల్లోనే

కార్పొరేషన్(కాకినాడ), అక్టోబరు 27(ఆంధ్రజ్యోతి): గుండు సూది నుంచి గునపం వరకు.. పాత సైకిల్ నుంచి మోపెడ్ వరకు.. మిక్సీ నుంచి మోటార్స్ వరకు.. బ్రాండెడ్ వస్త్రాలను పోలిన దుస్తుల నుంచి అందమైన ఫ్లవర్‌వాస్‌ల వరకు ఇలా ఒక్కటేమిటి చెప్పుకుంటూపోతే వందల్లో వస్తువులు గుట్టలు.. గుట్టలుగా కనిపిస్తాయి. పేదవాడు నుంచి సామాన్య మధ్యతరగతి వరకు వారి కలలను తీరుస్తాయి. ఇదంతా ఎక్కడో హైదరాబాద్ కోటిబజార్ అనుకుంటున్నారా కాదు కాకినాడ సండే బజార్‌లోనే ఇవన్నీ దొరుకుతాయి. ఆదివారం వచ్చిదంటే చాలు కాకినాడ మెయిన్ రోడ్డు అంతా చిరు వ్యాపారులతో వినియోగదారులతో సందడిగా కనిపిస్తుంది. అంతేకాదు తిరునాళ్లను తలపిస్తుంది. ఇక్కడ రూపాయి నుంచి వందలు, వేలల్లో అందరికీ సరసమైన ధరల్లో అందుబాటులో ఉంటాయి. వస్తువు నాణ్యతనుబట్టి బేరం ఆడుకునే సౌకర్యం ఉంది. కొత్తవీ, పాతవీ అన్నీ ఉంటాయి.

తెల్లవారుజామునే మొదలు

కాకినాడ మెయిన్‌రోడ్డు ఎల్ఐసీ ఆఫీస్ నుంచి జగన్నాథపురం వంతెన వరకు ఈ సండేబజార్ జరుగుతుంది. ఆదివారం తెల్లవారుజామున 4గంటల నుంచి రాత్రి 10గంటల వరకు మెయిన్ రోడ్డంతా మార్కెట్‌లో సందడిగా ఉంటుంది. కొన్ని వస్తువుల వరకు తెల్లవారుజామున 3 గంటల నుంచి 5 గంటలు వరకు ప్రత్యేక బజారు ఒకటి నడుస్తుంది. ఇది ఉదయం 5 దాటితే క్లోజ్ అవుతుంది.

బ్రాండెడ్ వస్తువుల్ని తలపిస్తాయి..

ఇక్కడ బ్రాండెడ్ వస్తువులను పోలిన వస్తువులెన్నో లభిస్తాయి. దుస్తులు, షూస్, సైకిళ్లు, మోపెడ్స్ మిక్సీలు, గ్రైండర్లు, మొబైల్స్, గృహోపకరణాలు ఇలా ప్రతి వస్తువు బ్రాండెడ్‌తోపాటు నాన్ బ్రాండెడ్ కూడా ఉంటాయి. మార్కెట్‌లో సైకిళ్ల ధరకన్నా కొత్తవి కూడా చౌకగానే లభ్యమవుతాయి. పాత వస్తువులైతే వాటి కండీషన్‌ని బట్టి కొనుక్కోవచ్చు.

150 గ్రామాల నుంచి..

కాకినాడ పరిసర ప్రాంతాల్లోని సుమారు 150 గ్రామాల నుంచి ఈ సండేబజార్‌కు వివిధ రకాల వస్తువులు కొనుగోలుకు వ్యాపారులు, వినియోగదారులు తరలివస్తారు. యానాం, తాళ్లరేవు, ముమ్మిడివరం, ఎదురులంక వంటి గ్రామాలతోపాటు తుని, కోటనందూరు, అన్నవరం, కత్తిపూడి, గొల్లప్రోలు, చేబ్రోలు, పిఠాపురం, ప్రత్తిపాడు, సామర్లకోట, పెద్దాపురం వంటి పరిసర ప్రాంత ప్రజలంతా తెల్లవారుజామున 4 గంటలకే సండేబజార్‌కి వస్తుంటారు. కొన్ని వస్తువులు ఆ సమయంలో మాత్రమే దొరకడమే దానికి కారణం.

షోరూమ్‌లకు సెలవు కావడంతో..

నిత్యం రద్దీగా ఉండే మెయిన్ రోడ్డు ఆదివారం షోరూమ్‌లకు సెలవు కావడంతో సండేబజార్‌కి వెసులుబాటు లభించింది. దీంతో షోరూం వ్యాపారులతోపాటు హోల్‌సేల్ వ్యాపారులు కూడా సండేబజారులో తక్కువ ధరలకే వారి వద్ద ఉన్న బట్టలను, వస్తువులను ఇతరత్రా వాటిని విక్రయిస్తుంటారు. కంపెనీలో ఎక్స్‌పైరీ డేట్ దగ్గర పడుతున్న వస్తువలను కూడా ఇక్కడ తక్కువ ధరకు విక్రయిస్తారు. దీంతో సండేబజార్‌లో తక్కువ ధరలకే మంచి వస్తువులు దొరుకుతాయనే నమ్మకంతో ప్రజలు సండేబజారుపై ఎక్కువ ఆసక్తి చూపిస్తారు. ఉదాహరణకు షోరూమ్‌లో రూ.8 వేల నుంచి 10 వేలు పెట్టి కొనుగోలు చేసే సైకిల్ సండేబజారులో రూ.5వేలకే లభిస్తుంది. షోరూమ్‌లో రూ.వెయ్యి నుంచి రూ.2 వేలకు కొనుగోలు చేసే షూ ఇక్కడ రూ.200 నుంచి రూ.500కే లభిస్తుంది. సెకండ్ హ్యాండ్ మొబైల్స్ కంప్యూటర్ మౌస్‌లు, కీబోర్డులు ఇక్కడ తక్కువ ధరకే లభిస్తాయి. ఇంటి గృహోపకరణాలైతే చాలా తక్కువకే దొరికేస్తాయి.



బేరం కుదిరింది.. సైకిల్ బైక్ ఎక్కింది..



రేటు కారుచౌక.. రండిలా.. వస్త్ర దుకాణాల వద్ద రద్దీ



అన్ని సైజుల్లో వంట సామాన్లు.. విక్రయాలు జరుపుతున్న వ్యాపారి



పాతవే.. అన్నీ పనిచేసేవే.. సండేబజార్‌లో సెకండ్ హ్యాండ్ వస్తువులు



50.. 50.. 100.. ఏదైనా అదే ధర.. సండేబజార్ స్పెషల్



చింతూరు మండలంలో ఇంటింటా తిరుగుతూ యాచిస్తున్న గంగిరెద్దు, బసవయ్యలు

గంగిరెద్దుల.. జీవన యాత్ర!

- గంగిరెద్దుల వారికి ఇదే జీవనాధారం
- తరతరాలుగా ఇదే వృత్తితో జీవనం
- డోలు, సన్నాయిలతో కోలాహలం
- ప్రతి ఇల్లు సిరి సంపదలతో విరాజిల్లాలని దీవెన
- వారు మాత్రం పాత వస్త్రాలకే పరిమితం
- ఇదీ డూడూ బసవన్నల బతుకుపోరాటం



(చింతూరు-ఆంధ్రజ్యోతి)

గంగిరెద్దు.. నోరులేని మూగజీవి.. అయితేనేమి కొన్ని కుటుంబాలకు అదే జీవనాధారం. అందుకే వారికి గంగిరెద్దంటే ప్రాణంతో సమానం. వారు చిరిగిన వస్త్రాలు ధరించినా గంగిరెద్దుని మాత్రం నిత్య పెళ్లి కొడుకులా అలంకరిస్తారు. ఎందుకంటే అదే వారికి పెద్ద కొడుకంట. గంగిరెద్దు లేకుంటే తమకు జీవనమే లేదంటున్నారు. తరాలుగా తమ బతుకు ఇదేనంటున్నారు. పొట్టకూటి కోసం ఇల్లు, వాకిలి వీడి ఊరూరా తిరగాల్సిన దయనీయ స్థితి వారిది. అమ్మగారికి దండం పెట్టు.. అయ్యగారికి దండం పెట్టు అంటుంటే గంగిరెద్దు ఆడడం చూడముచ్చటగా ఉంటుంది. కృష్ణా జిల్లా తిరువూరు మండలం గానుగపాడులో పలు కుటుంబాలు గంగిరెద్లపై ఆధారపడి జీవిస్తున్నాయి. వారిలో కొన్ని కుటుంబాలు ఏటా చింతూరు ఏజెన్సీకి వస్తాయి. ఈసారి సుమారు పది కుటుంబాలు ఇక్కడికి వచ్చాయి. దసరా నుంచి సంక్రాంతి వరకు ఆ కుటుంబాలు ఇక్కడి ప్రతి పల్లెల్లో తిరుగుతాయి. ఈ క్రమంలో ఎవరికి తోచింది వారికి ఇస్తుంటారు. రైతులు చేటలో ధాన్యం పోసి గంగిరెద్దుకు తినిపిస్తారు. అలా చేస్తే పంటలు బాగా పండుతాయని వారి నమ్మకం. ఇంట్లోని పాత వస్త్రాలను గంగిరెద్దు అలంకరణకు ఇస్తారు. రైతులు చేసిన దాన, ధర్మాలకు సంతోషం వ్యక్తం చేస్తూ బసవన్నలు దొరగారి ఇల్లు సిరి సంపదలతో కళకళలాడాలని దీవిస్తాయి. కాగా బసవయ్యల బతుకులు మాత్రం చిరిగిన వస్త్రాల వద్దే ఆగిపోతుంటాయి. ఊరూరా ప్లాస్టిక్ టార్పాలిన్లతో డేరాలు వేసుకొని అక్కడే వంట-వార్పు చేసుకుంటారు. చిమ్మచీకట్లోనే వారి కాపురం. వేకువనే మకాం నుంచి బయల్దేరి మధ్యాహ్నం వరకు ఇంటింటా యాచించడం వారి జీవన శైలి. ఇదంతా ఒక ఎత్తయితే గంగిరెద్దుకు శిక్షణ ఇప్పించడం మరో ఎత్తు. మంచి జాతి గిత్తని ఎంచుకోవడం మొదటిది. తర్వాత ప్రకాశం జిల్లా రాజనెల్లూరులో గంగిరెద్దులకు శిక్షణ ఇచ్చే గురువు వద్దకు తీసుకెళ్లాల్సి ఉంటుంది. శిక్షణ ఇచ్చేందుకు గురువుకు దక్షిణ ఇచ్చుకోవాల్సి ఉంటుంది. ఒకింత స్థాయిని మించి (సుమారు రూ.25వేల దాకా) దక్షిణ ఉన్నప్పటికీ తప్పని స్థితి. శిక్షణ రెండు నెలల నుంచి ఒక్కోమారు ఏడాది కూడా ఇవ్వాల్సి ఉంటుంది. తరతరాలుగా ఇదే తమ జీవితం కావడంతో ఊరూరా కాలినడకన తిరిగి తిరిగి మోకాళ్లు అరిగిపోయి చివరకు నడవడానికి ఓపిక లేని స్థితిలో అవస్థలు పడుతుంటామని బసవయ్యలు ఆవేదన వ్యక్తంచేస్తున్నారు. అయినా ఈ వృత్తి తప్ప తమకు మరో దారి లేదంటున్నారు. ఏడాదిలో మూడు నుంచి నాలుగు నెలలపాటు పల్లెల్లో యాచించి మిగిలిన కాలంలో తమ ఊరిలో కూలి పనులకు వెళ్తామంటున్నారు. తమ కుటుంబాల్లో ఉద్యోగం చేసేవాళ్లే లేరని నిరాశ చెందుతున్నారు. ఆ భాగ్యం వారికెప్పుడు కలుగుతుందో మరి.





చింతూరులో వారి వలస గుడారాలు.. గంగిరెద్దులతో నడిచి నడిచి కాళ్లు వంకర్లు పోయిన దృశ్యం

యానాంలో ఘనంగా 'కవిసంధ్య' స్వర్ణోత్సవ సభ



కవిసంధ్య కవిత్వ పత్రిక తొలి సంచికను ఆవిష్కరిస్తున్న పుదుచ్చేరి ప్రభుత్వ ఢిల్లీ ప్రత్యేక ప్రతినిధి మల్లాడి కృష్ణారావు



శిఖామణి సాహితీ పురస్కారాన్ని వాడ్రేవు చిన వీరభద్రుడు, యువ పురస్కారం పాయల మురళీకృష్ణకు అందజేసి సత్కరిస్తున్న దృశ్యం

- కవిసంధ్య తొలి స్వర్ణోత్సవ సంచిక ఆవిష్కరణ
- శిఖామణి సాహితీ, యువ పురస్కారం అందజేత

యానాం, అక్టోబరు 27(ఆంధ్రజ్యోతి): యానాం కేంద్రంగా వెలువడుతున్న కవిసంధ్య, కవిత్వపత్రిక స్థాపించి 50 సంచికలు పూర్తి చేసుకున్న నేపథ్యంలో స్వర్ణోత్సవ సభను నిర్వహించారు. కవిసంధ్య సాహితీ సాంస్కృతిక సంస్థ యానాం-హైదరాబాద్ నిర్వహణలో ఇది జరిగింది. ఆదివారం ఉదయం కామిశెట్టివారి వీధిలోని గీతాభవన్‌లో కవిసంధ్య అధ్యక్షుడు శిఖామణి, పురస్కార కమిటీ అధ్యక్షుడు దాట్ల దేవదానం రాజు అధ్యక్షతన జరిగిన కార్యక్రమానికి ముఖ్యఅతిథులుగా పుదుచ్చేరి ప్రభుత్వ ఢిల్లీ ప్రత్యేక ప్రతినిధి మల్లాడి కృష్ణారావు, ఆత్మీయ అతిథులుగా డాక్టర్ దీర్ఘాశి విజయ్ భాస్కర్, డాక్టర్ సి.మృణాళిని, డాక్టర్ వీరలక్ష్మీదేవి, ఆంధ్రజ్యోతి ఎడిషన్ ఇన్‌చార్జి మంగేష్, డాక్టర్ ఆర్.సీతారాం తదితరులు హాజరయ్యారు. ముఖ్యఅతిథులను నిర్వాహకులు సత్కరించారు. ఈ సందర్భంగా మల్లాడి మాట్లాడారు. కవితా సదస్సులు నిరంతరం కొనసాగాలని, అందుకు కావాల్సిన సహకారం ఉంటుందని అన్నారు. ప్రస్తుతం ఇస్తున్న పురస్కారం వచ్చేఏడాది నుంచి పెంచాలని, మహిళలకు ప్రత్యేకంగా పురస్కారం ఇవ్వాలని, ఇందుకు పెంచిన మొత్తం ఇస్తానని వెల్లడించారు. కవులు తక్కువ మందే ఉండవచ్చు కానీ వారు రాసిన కవితలు, కథల ప్రభావం లక్షలాది మందిపై ఉంటుందన్నారు. ఇటువంటి కార్యక్రమాలు కొంతభారం అనిపించినా ఇతరుల సహకారం ఉంటే మరికొంతమంది ముందుకు వచ్చి మరికొన్ని కార్యక్రమాలు నిర్వహించేందుకు అవకాశాలు ఉంటాయన్నారు. శిఖామణి సాహితీ పురస్కారం-2024కు ప్రముఖ కవి, విమర్శకులు, అనువాదకుడు, కేంద్ర సాహిత్య అకాడమీ అవార్డు గ్రహీత వాడ్రేవు చినవీరభద్రుడు మాట్లాడారు. శిఖామణితో 35 ఏళ్ల అనుబంధమన్నారు. తనకు సమ వయస్కుడైన కవి తన పేరుమీద పురస్కారం ఇవ్వడానికి ఎంతో ఔదార్యం కలిగి ఉండాలన్నారు. కార్యక్రమంలో కవులు మధునాపంతులు సత్యనారాయణమూర్తి, డాక్టర్ వరుగు భాస్కరరెడ్డి, మురళీశంకర్, సుంకర గోపాల్, బొల్లోజు బాబా, సీహెచ్ రాం, అశోక్ పాల్గొన్నారు.

కవిసంధ్య ప్రతిభా పురస్కార గ్రహీతలు వీరే

ఈ సందర్భంగా 13మంది (వచన, అభ్యుదయ, పత్రికా, లఘు కవిత, దళిత సాహిత్యం)కి ముఖ్యఅతిథులు కవిసంధ్య ప్రతిభా పురస్కారాలు అందజేశారు. వీరిలో కొమ్మవరపు విల్సన్ రావు, కపిల రాంకుమార్, పోనుగుమట్ల విష్ణుమూర్తి, ఎన్.ఈశ్వర రెడ్డి, కాళ్లకూరి శైలజ, జీవీ రత్నాకర్, మార్ని జానకిరామచౌదరి, మోకా రత్నరాజు, సరికొండ నరసింహరాజు, కోలాటి పెద్దిరాజు, కొండూరి రమరాజు, పీవీ రమణ, ఎస్‌వీ రామశాస్త్రి ఉన్నారు.

కవిసంధ్య తొలి, స్వర్ణోత్సవ సంచిక ఆవిష్కరణ

కవిసంధ్య కవిత్వ పత్రిక తొలి సంచికగా యుగకర్త కందుకూరి వీరేశలింగం పంతులు ముఖచిత్రంతో 16 పేజీల పత్రికను, కవిసంధ్య 136 పేజీలతో స్వర్ణోత్సవ సంచికను ముఖ్యఅతిథి పుదుచ్చేరి ప్రభుత్వ ఢిల్లీ ప్రత్యేక ప్రతినిధి మల్లాడి కృష్ణారావు ఆవిష్కరించి అతిథులకు అందజేశారు. శిఖామణి మలయాళ కవిత్వం సంచికను ప్రముఖ కవి డాక్టర్ ఆర్.సీతారాం అవిష్కరించారు. కవిసంధ్య డిజిటలైజేషన్‌ను వక్తలు అవిష్కరించారు.

శిఖామణి సాహితీ, యువ పురస్కారం

ప్రతిఏటా సాహిత్యంలో జీవనసాఫల్య కృషికి ఇచ్చే శిఖామణి సాహితీ పురస్కారం-2024కు వాడ్రేవు చిన వీరభద్రుడు, కవిత్వంలో యువ కవులకు ఇచ్చే శిఖామణి యువ పురస్కారం-2024కు యువకవి, విమర్శకుడు, విజయనగరం తెలుగు అధ్యాపకుడు పాయల మురళీకృష్ణకు అందజేశారు. అవార్డులో పదివేల నగదు, మెమోంటో, సన్మాన పత్రాలను అందజేశారు.

బ్రదర్...డ్యాన్స్ సూపర్

తుని డిపో బస్సు కాంట్రాక్ట్ డ్రైవర్ డ్యాన్స్ నెట్టింట వైరల్

ప్రశంసిస్తూ 'ఎక్స్'లో మంత్రి లోకేశ్ ట్వీట్

ఉద్యోగానికి రావొద్దంటూ డిపో సీఐ మౌఖిక ఆదేశాలు!

తుని రూరల్, అక్టోబరు 27(ఆంధ్రజ్యోతి): కాకినాడ జిల్లా తుని ఆర్టీసీ డిపో కాంట్రాక్ట్ డ్రైవర్ నేతల లోవరాజు డ్యాన్స్‌కు మంత్రి లోకేశ్ ఫిదా అయ్యారు. విద్యార్థుల ప్రత్యేక బస్సు వెళ్తుండగా ఆ దారిలో ఓ భారీ వాహనం అడ్డువచ్చి గంటసేపు ఆగిపోవాల్సి వచ్చింది. ఈ మధ్యలో అతడు దేవర సినిమా పాటకు డ్యాన్స్ వేసి విద్యార్థులను ఉర్రూతలూగించాడు. మూడు రోజుల క్రితం జరిగిన ఈ సంఘటన నెట్టింట వైరల్‌గా మారింది. మంత్రి లోకేశ్ కూడా డ్రైవర్ డ్యాన్స్‌ను మెచ్చుకుంటూ ట్వీట్ చేశారు. దీంతో డ్రైవర్ లోవరాజు ఎనలేని ఆనందం పొందాడు. కానీ, ఆ డ్రైవర్ విధి నిర్వహణలో అలక్ష్యం వహించాడని భావించిన డిపో సీఐ అతడిని డ్యూటీకి రావొద్దంటూ మౌఖికంగా ఆదేశాలు ఇచ్చినట్టు సమాచారం.

కాకినాడ జిల్లా తుని డిపోలో లోవరాజు డ్రైవర్‌గా విధులు నిర్వహిస్తున్నాడు. మూడు రోజుల క్రితం అతడు రౌతులపూడి నుంచి స్కూల్, కాలేజ్ విద్యార్థులను ఎక్కించుకుని తునికి వస్తున్నాడు. ఆ మార్గం సింగిల్ రోడ్డు కావడంతో కోదూరు సమీపంలో బస్సుకు ఎదురుగా భారీ వాహనం నిలిచిపోయింది. దీంతో బస్సు ముందుకు వెళ్లలేక వెనక్కి రాలేని పరిస్థితి ఏర్పడింది. భారీ వాహనాన్ని కదిలించేందుకు గంటకు పైగా సమయం పడుతుందని తెలియడంతో బస్సులోని విద్యార్థులను ఎంటర్‌టైన్ చేయాలనుకున్న డ్రైవర్ బస్సుకు ఎదురుగా దేవర సినిమా పాటకు డ్యాన్స్ వేశాడు. దాన్ని వీడియో తీసిన విద్యార్థులు వైరల్ చేయడంతో లోవరాజు టాలెంట్ మంత్రి దృష్టికి వెళ్లగా ఆయన అభినందిస్తూ శనివారం రాత్రి 'ఎక్స్'లో ట్వీట్ చేశారు. కాగా, డ్రైవర్ విధి నిర్వహణలో అలక్ష్యం వహిస్తూ ప్రయాణికులను నిర్లక్ష్యం చేస్తున్నాడంటూ కొందరు ఈ వీడియోను వైరల్ చేశారు. కొన్ని లోకల్ పత్రికల్లో దీనిపై వార్తలు ప్రచురితమయ్యాయి. ఇవి గమనించిన తుని డిపో సీఐ అతడిని డ్యూటీకి రావొద్దంటూ ఆదేశాలు ఇచ్చారని తెలిసింది. వాస్తవానికి అది విద్యార్థుల స్పెషల్ బస్సు మాత్రమేనని, ఈ ఘటన సమయంలో ఆ మార్గంలో వాహనం గంటసేపు ఆగిపోయిందని, అప్పుడే డ్రైవర్ డ్యాన్స్ వేశాడని తెలిసింది. దీనిపై డిపో డీఎంను ప్రశ్నించగా అతడు కాంట్రాక్ట్ డ్రైవర్ మాత్రమేనని, అతడిని సస్పెండ్ చేసే అవకాశం లేదని, అలా చేసినట్టు వస్తున్న వార్తల్లో నిజం లేదన్నారు.



డ్రైవర్ లోవరాజు



మూడురోజులక్రితం బస్సు ఎదురుగా డ్యాన్స్ చేస్తున్న డ్రైవర్ లోవరాజు

దివాన్‌చెరువుకు చేరిన అయ్యప్పభక్తుల

శబరిమల సైకిల్‌యాత్ర

దివాన్‌చెరువు, అక్టోబరు 27(ఆంధ్రజ్యోతి): అయ్యప్పమాల ధరించిన కాకినాడ జిల్లాలోని తుని, కోటనందూరు మండలాలకు చెందిన ఐదుగురు భక్తులు శబరిమలకు సైకిల్ యాత్ర చేపట్టారు. జాతీయ రహదారి మీదుగా ప్రయాణిస్తూ ఆదివారం దివాన్‌చెరువుకు చేరుకున్న తుని మండలం డి.పోలవరానికి చెందిన బండారు రవి గురుస్వామి, స్వాములు చింతల ప్రసాద్, మదనాడ సాయి, కోటనందూరు మండలం బిళ్లనందూరుకు చెందిన రుత్తల దుర్గాప్రసాద్, బొత్స నాగేశ్వరరావులను ఆంధ్రజ్యోతి పలకరించింది. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ 26న నుంచి సైకిల్ యాత్ర ప్రారంభించామన్నారు. రోజుకు వంద కిలోమీటర్ల చొప్పున యాత్ర సాగించి వచ్చేనెల 15కి చేరుకుంటామన్నారు. తొలిరోజైన శనివారం మధ్యాహ్నం సమయంలో యాత్ర ప్రారంభించామన్నారు. ఆదివారం నుంచి రోజుకు 100 కిలోమీటర్ల దూరం ప్రయాణం చేస్తామన్నారు. రోజూ ఉదయం 7 గంటల నుంచి సాయంత్రం 5 వరకు యాత్ర సాగించి మార్గమధ్యలోని స్వాముల పీఠాల వద్ద హారతులు ఇస్తామన్నారు. రాత్రి సమయంలో స్వాముల పీఠాల వద్ద బస చేస్తున్నామని చెప్పారు. ఈ యాత్రలో తాము విజయవాడ, తిరుపతి, శ్రీశైలం, కాణిపాకం, గోల్డెన్ టెంపుల్, అరుణాచలం, ఫళని, ఎరుమేళిలను సందర్శిస్తామన్నారు. స్వామి, అమ్మవార్లను దర్శించుకుంటూ పంబ వరకూ సైకిల్ యాత్ర సాగిస్తామన్నారు. అక్కడి నుంచి నడక మార్గాన శబరిమల చేరుకుని అయ్యప్పస్వామిని దర్శించుకుంటామని తెలిపారు.

ఇరుముడితో విమాన ప్రయాణంపై హర్షం: అయ్యప్ప భక్తులు ఇరుముడితో విమానంలో ప్రయాణాన్ని సులభతరం చేయడంపై టీడీపీ రాష్ట్ర బీసీ సాధికార సమితి డైరెక్టరు వంకమల్లికార్జునస్వామి (మల్లిబాబు) హర్షం వ్యక్తం చేశారు. ఆదివారం ఆయన మాట్లాడుతూ కేంద్ర విమానయానశాఖ మంత్రి కె.రామ్మోహన నాయుడు తీసుకున్న ఈ నిర్ణయం వల్ల ఇరుముడిని సౌలభ్యంగా తీసుకు వెళ్లడానికి వీలు కలుగుతుందన్నారు. ఈ సందర్భంగా కేంద్రమంత్రికి ఆయన ధన్యవాదాలు తెలిపారు.



శబరిమలైకి సైకిల్ యాత్ర చేస్తున్న అయ్యప్పస్వాములు

కొత్త బస్సులు ప్రారంభం


కొత్త బస్సును జెండా ఊపి ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే సత్యప్రభ

అన్నవరం, అక్టోబరు 27 (ఆంధ్రజ్యోతి): అన్నవరం దేవస్థానం రూ.82లక్షలతో నూతనంగా కొనుగోలు చేసిన రెండు బస్సులను ప్రత్తిపాడు ఎమ్మెల్యే వరుపుల సత్య ప్రభ ఆదివారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ భక్తులకు మెరుగైన సౌకర్యాల కల్పనకు ప్రభుత్వం తరపున సహాయ సహకారాలు అందించేందుకు తానెప్పుడూ సిద్ధమని చెప్పారు. కార్యక్రమంలో ఈవో రామచంద్రమోహన్, చైర్మన్ ఐవీ రోహిత్, కూటమి నాయకులు పాల్గొన్నారు.

సత్య దీక్షలు ఆరంభం


ప్రధానాలయం ముందు సత్యదీక్షాపరులు

అన్నవరం, అక్టోబరు 27 (ఆంధ్రజ్యోతి): రత్నగిరివాసుడైన సత్యదేవుడికి అత్యంత ప్రీతికరమైన సత్య దీక్షలను ఆదివారం భక్తిశ్రద్ధలతో స్వీకరించారు. వేకువజామున శిరస్నానం చేసి పసుపు రంగు వస్త్రాలు ధరించి మాలలు వేసుకున్నారు. అడ్డతీగలలో పవనగిరి స్వామీజీ 600 మంది గిరిజనులు, ప్రత్తిపాడు, జగ్గంపేట మండలాల్లో ప్రచారకర్త కృష్ణబాబు ఆధ్వర్యంలో ప్రజలు, రత్నగిరి ఉద్యోగులు, అన్నవరంలో గ్రామస్తులు దీక్ష తీసుకున్నారు. మహిళల కోసం 18 రోజుల దీక్షను వచ్చే నెల 6వ తేదీన, 9 రోజుల దీక్షను 14న తీసుకుంటారు. 23న ఇరుముడి సమర్పణతో విరమిస్తారు.

కార్తీక మాసోత్సవాలకు సిద్ధం

భక్తులకు సౌకర్యాల కల్పనపై ప్రత్తిపాడు ఎమ్మెల్యే అధ్యక్షతన పలు శాఖల అధికారులతో అన్నవరం దేవస్థానం ఈవో, చైర్మన్ రోహిత్ సమీక్ష

అన్నవరం, అక్టోబరు 27: కార్తీక మాసంలో సత్యదేవుని సన్నిధికి లక్షలాదిగా విచ్చేసే భక్తులకు సౌకర్యాల కల్పన, తెప్పోత్సవం, గిరిప్రదక్షణలపై ఆదివారం ప్రత్తిపాడు ఎమ్మెల్యే వరుపుల సత్యప్రభ అధ్యక్షతన ఈవో, చైర్మన్, పోలీసు, రెవెన్యూ ఇతర శాఖల అధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించారు.

ఈవో రామచంద్రమోహన్ మాట్లాడుతూ పర్వదినాల్లో వ్రతం టిక్కెట్ల కౌంటర్‌ను రాత్రి 10 గంటలకు ప్రారంభించి 12 గంటల నుంచి వ్రతాలు, ఒంటి గంట నుంచి సర్వదర్శనాలను ప్రారంభిస్తామన్నారు.

● ఎటువంటి తొక్కిసలాట జరగకుండా తిరుమలలో మాదిరిగా కంపార్ట్‌మెంట్, క్యూలైన్లలో భక్తులు కూర్చునేందుకు ఏర్పాట్లు చేశామన్నారు.

● రూ.1.43 కోట్లతో పర్మినెంట్, తాత్కాలిక సదుపాయాలు సమకూర్చామన్నారు. పర్వదినాల్లో సెక్యూరిటీ, శానిటేషన్ సిబ్బందిని అదనంగా నియమించామన్నారు. మిగిలిన కార్యకలాపాలకు సింహాచలం దేవస్థానం నుంచి పలువురు ఉద్యోగులను డిప్యుటేషన్‌పై తీసుకుంటామన్నారు. ప్రధాన మార్గాల్లో సమాచార కేంద్రాలు, భక్తులు అధికంగా ఉండేచోట్ల మరుగుదొడ్లు, స్నానపు గదులు తాత్కాలికంగా ఏర్పాటు చేస్తున్నామన్నారు. రూ.300 వ్రతం భక్తులకు 9 మండపాలు సిద్ధం చేయగా... ఏక కాలంలో సుమారు 3,500 వ్రతాలు జరిగేలా చర్యలు తీసుకున్నామన్నారు.

● కార్తీక పౌర్ణమి రోజైన నవంబరు 15వ తేదీ ఆచార సంప్రదాయలను గౌరవిస్తూ ఉదయం 7.30 గంటలకు పల్లకిలో స్వామి, అమ్మవార్లకు గిరి ప్రదక్షిణ చేయిస్తామన్నారు. మధ్యాహ్నం 2.30 గంటలకు సత్య రథంతో భక్తులతో గిరి ప్రదక్షిణ నిర్వహిస్తామన్నారు. తద్వారా దర్శనాలు, వ్రతాలు చేయించుకునే భక్తులు, గిరి ప్రదక్షిణలో పాల్గొనే భక్తుల తాకిడి తగ్గి స్వామిని ప్రశాంతంగా దర్శించుకునే వీలుంటుందన్నారు.


సమావేశంలో పాల్గొన్న ఎమ్మెల్యే, ఈవో, చైర్మన్, వివిధ శాఖల అధికారులు

● సత్యగిరి నుంచి రత్నగిరికి చేరుకునే వారికి ఉచిత వాహన సౌకర్యం కల్పిస్తామన్నారు. ఇప్పటికే ఉచిత బస్సులు తిరుగుతుండగా టాటా మ్యాజిక్ వాహనాలను అదనంగా అందుబాటులో ఉంచుతామన్నారు. కొండ దిగువ నుంచి, రైల్వే స్టేషన్ నుంచి ప్రత్యేక బస్సులు నడుపుతామన్నారు..

● గిరిప్రదక్షిణ మార్గంలో సీసీ కెమెరాలు ఏర్పాటుచేయాలని ప్రత్తిపాడు సీఐ సూరి అప్పారావు కోరగా ఈవో అంగీకరించారు. భక్తులు బసచేసే ప్రదేశాలు, అధికంగా సంచరించే ప్రాంతాల్లో అధిక నిఘా పెడతామని, దేవస్థానం సహకరించాలని కోరారు.

● కొండ దిగువన మెయిన్‌రోడ్డు ఆక్రమణకు గురికాకుండా, దుకాణ సముదాయాలు రోడ్డుపైకి రాకుండా, ట్రాఫిక్‌కి ఇబ్బం ది లేకుండా చూస్తామని రెవెన్యూ, ఆర్‌అండ్‌బీ, పంచాయతీ శాఖ అధికారులు తెలిపారు.

● నిరంతరం బస్సులు నడపాలని ఆర్టీసీ అధికారులను, అంతరాయం లేకుండా విద్యుత్ సరఫరా చేయాలని విద్యుత్‌శాఖ అధికారులను, కొండ దిగువ, కొండపైన, సత్యగిరిపై ప్రత్యేక మెడికల్ క్యాంపులు ఏర్పాటు చేయాలని వైద్య, ఆరోగ్య శాఖ అధికారులను కోరారు.

● తెప్పోత్సవానికి పంపా సరోవరంలో తగినంత నీటి నిల్వలు ఉండేలా చూడాలని, లైఫ్ జాకెట్లు, గజ ఈతగాళ్లను అందుబాటులో ఉంచాలని ఇరిగేషన్ అధికారులను ఈవో కోరారు.

● అన్ని శాఖల అధికారులూ సమన్వయంతో ఉండి భక్తులకు ఎటువంటి అసౌకర్యం కలగకుండా చూడాలని ఎమ్మెల్యే సత్యప్రభ సూచించారు. సమావేశంలో దేవస్థానం చైర్మన్ ఐవీ రోహిత్, పెద్దాపురం డీఎస్పీ శ్రీహరిరాజు, ఆర్డీవో శ్రీరమణి, అన్నవరం ఎస్ఐ హరిబాబు, దేవస్థానం ఇంజనీరింగ్, ఇతర శాఖల అధికారులు పాల్గొన్నారు.



ఉత్సవమూర్తులను అభిషేకిస్తున్న అర్చకస్వాములు, కల్యాణోత్సవంలో పాల్గొన్న ఎమ్మెల్యే సత్యానందరావు దంపతులు

కల్యాణం కమనీయం

- ఏడవ రోజుకు వాడపల్లి వెంకన్న వార్షిక బ్రహ్మోత్సవాలు
- స్వామివారికి పట్టు వస్త్రాలు సమర్పించిన ఎమ్మెల్యే బండారు దంపతులు
- రాజాధిరాజ అలంకరణలో శ్రీవారు
- గజవాహన సేవలో పాల్గొన్న భక్తులు

ఆత్రేయపురం, అక్టోబరు 27 (ఆంధ్రజ్యోతి): కోనసీమ తిరుమల వాడపల్లి శ్రీదేవి, భూదేవి సమేత శ్రీవేంకటేశ్వరస్వామి 12వ వార్షిక బ్రహ్మోత్సవాలు అంగరంగ వైభవంగా జరుగుతున్నాయి. ఏడవ రోజైన ఆదివారం లోక కల్యాణార్థం శ్రీనివాసుని కల్యాణం రమణీయంగా జరిగింది. స్వామివారి మూల విరాట్టుకు ప్రత్యేక పూజలు నిర్వహించి శ్రీవారిని స్వర్ణశోభితుడిని చేసి పుష్పాలతో అలంకరించారు. వసంత మండపంలో ఉత్సవ మూర్తులు కొలువుదీరారు. వైఖానస ఆగమ శాస్త్ర ప్రకారం ఖండవల్లి వరప్రసాదాచార్యులు బ్రహ్మత్వంలో వేద పండితులు, అర్చకులు సంకల్పం, విశ్వక్సేన పూజ, పుణ్యాహవచనం, పంచామృత మంటపారాధన, మహాస్నపనం, ప్రధాన హోమాలు జరిపారు. కొత్తపేట ఎమ్మెల్యే బండారు సత్యానందరావు-కమలారాణి దంపతులు స్వామి, అమ్మవార్లకు పట్టు వస్త్రాలు సమర్పించారు. జగత్ కల్యాణార్థం స్వామివారి కల్యాణాన్ని ఎమ్మెల్యే బండారు దంపతులు, ఉప కమిషనరు, ఈవో నల్లం సూర్యచక్రధరరావు-కనకదుర్గాదేవి దంపతులు జరిపించారు. వేదమంత్రాలు, మేళతాళ మంగళ వాయిద్యాలు, భక్తుల గోవిందనామస్మరణ నడుమ మంగళసూత్ర ధారణ, తలంబ్రాల తంతును కనులారా వీక్షించిన భక్తులు తన్మయత్వం పొందారు.

ఆదివారం రాత్రి శ్రీవారు రాజాధిరాజ అలంకరణలో గజవాహనంపై ఆసీనులై తిరువీధుల్లో విహరించారు. వేదఘోష, మంగళవాయిద్యాలు, బాణసంచాకాల్పుల నడుమ శ్రీవారు భక్తులకు అభయహస్తం అందించారు. ముదునూరి వెంకట్రాజు-సత్యశ్రావణి దంపతులు, కాయల జగన్నాథం-మంగాదేవి దంపతులు పాల్గొన్నారు.


రాజాధిరాజ అలంకరణలో శ్రీవారు

కేరళ వాయిద్యాలు, మహారాష్ట్ర వాయిద్యం, హనుమాన్ వేషధారణ, మహిళల ప్రదర్శనలు విశేషంగా ఆకట్టుకున్నాయి. పుష్పాలతో అలంకరించిన ఫొటో షూట్ వద్ద భక్తులు సందడి చేశారు. ఫల, పుష్ప, విద్యుత్ అలంకరణ భక్తులను విశేషంగా ఆకట్టుకున్నాయి.


గజవాహన సేవలో పాల్గొన్న భక్తులు

వాడపల్లిలో నేడు ...

బ్రహ్మోత్సవాల్లో 8వ రోజైన సోమవారం తోమాల సేవ, మహా సుదర్శన హోమం, కల్ప వృక్ష వాహనసేవ, చూర్ణోత్సవం, రాత్రి కల్కి అలంకరణలో అశ్వ వాహన సేవ.

మూవీ ఆర్టిస్ట్స్అసోసియేషన్ లోగో ఆవిష్కరణ

పోర్టు సిటీ (కాకినాడ), అక్టోబరు 27 (ఆంధ్రజ్యోతి): ఆంధ్రప్రదేశ్ మూవీ ఆర్టిస్ట్ అసోసియేషన్ లోగోను కాకినాడ వెంకటరత్నపురంలోని దంటు కళా క్షేత్రంలో ప్రముఖ సినీ నటుడు గౌతంరాజు, కాకినాడ నగర సాహితీ స్రవంతి అధ్యక్షుడు మార్ని జానకిరామ్‌చౌదరి ఆదివారం సాయంత్రం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా గౌతంరాజు మాట్లాడుతూ రాష్ట్రం విడిపోయిన తర్వాత కొత్తగా అసోసియేషన్ ఏర్పాటు చేయాలని నిర్ణయించామని చెప్పారు. ఇందులో భాగంగా 2021లో రిజిస్ట్రేషన్ చేయించామన్నారు. తమ సంస్థ ఆధ్వర్యంలో నటులందరికీ ఇళ్ల స్థలాలు, వైద్య సౌకర్యాలు కల్పించేందుకు కృషి చేస్తామని తెలిపారు. సమావేశంలో డబ్బింగ్ ఆర్టిస్ట్ అసోసియేషన్ ఇన్‌చార్జి ఎం.సురేష్, జయకుమార్, కర్నాటి శ్రీనివాస్, వర్మ, వాసు, చంద్రరావు, గవర్రాజు, యంగ్మెన్స్ హ్యాపీ క్లబ్ సంయుక్త కార్యదర్శి నాదెళ్ల ప్రభుదాస్, రాష్ట్రంలో పలు జిల్లాల నుంచి వచ్చిన ప్రతినిధులు పాల్గొన్నారు.



లోగోను ఆవిష్కరిస్తున్న ప్రముఖ సినీ నటుడు గౌతంరాజు


స్వాధీనం చేసుకున్న మోటారు సైకిళ్లు

జి.మేడపాడు శివారులో పేకాట శిబిరంపై పోలీసుల దాడి

21 మంది అరెస్టు

రూ.84,500 నగదు స్వాధీనం

సామర్లకోట, అక్టోబరు 27 (ఆంధ్రజ్యోతి): కాకినాడ జిల్లా సామర్లకోట మండలం జి.మేడపాడు శివారున పెద్ద ఎత్తున పేకాట శిబిరం నిర్వహిస్తున్నారన్న సమాచారంతో సామర్లకోట పోలీసులు ఆదివారం రాత్రి అకస్మికంగా దాడులు చేశారు. పేకాడుతున్న 21 మందిని అదుపులోకి తీసుకుని వారి వద్ద నుంచి రూ.84,500 స్వాధీనం చేసుకున్నారు. 15 మోటారు సైకిళ్లు, 15 సెల్‌ఫోన్లు కూడా స్వాధీనం చేసుకున్నారు. జి.మేడపాడులో ఒక రాజకీయ పార్టీకి చెందిన ప్రముఖుడి అతిథి గృహంలో కొంత కాలంగా పేకాట జరుగుతోంది. నిర్వాహకులు, స్థానికులు మధ్య నెలకొన్న వివాదం నేపథ్యంలో అందిన సమాచారంతో పోలీసులు దాడి చేశారు. పట్టుబడిన వారిలో అధికార, ప్రతిపక్ష పార్టీల నాయకులు వున్నారు.

కమిటీ వేశాం... సమస్యలు పరిష్కరిస్తాం

- అస్సాగో ఇథనాల్ పరిశ్రమ కాలుష్య కారకాలపై నిజ నిర్ధారణ చేస్తాం
- గుమ్మళ్లదొడ్డిలో పర్యటించిన తూర్పు గోదావరి జిల్లా కలెక్టర్ ప్రశాంతి
- వేరేచోటకు తరలించాలని వేడుకున్న స్థానికులు

గోకవరం, అక్టోబరు 27 (ఆంధ్రజ్యోతి): గోకవరం మండలం గుమ్మళ్లదొడ్డిలో అస్సాగో ఇథనాల్ పరిశ్రమ ద్వారా తలెత్తుతున్న ఇబ్బందుల తొలగింపునకు తగిన చర్యలు తీసుకుంటామని తూర్పు గోదావరి జిల్లా కలెక్టర్ పి.ప్రశాంతి అన్నారు. కాలుష్యకారక పరిశ్రమను తరలించాలని డిమాండు చేస్తూ ఐదు రోజులు నిరవధిక దీక్ష చేపట్టిన సంగతి తెలిసిందే. ఈ నేపథ్యంలో పరిశ్రమ సమీపంలో ఉన్న ఎస్సీ పేటలో కలెక్టర్ ఆదివారం కలియతిరిగారు. పరిశ్రమ నుంచి వస్తున్న దుర్వాసన, శబ్దాలను తెలుసుకునే ప్రయత్నం చేశారు. అనంతరం రామాలయం వద్దకు చేరుకుని దీక్ష చేస్తున్న కాంగ్రెస్ పార్టీ జగ్గంపేట నియోజకవర్గ ఇన్‌చార్జి మరోతి శివగణేష్, సామాజిక ఉద్యమనేత పాటంశెట్టి సూర్యచంద్ర, ఆమె సతీమణి శ్రీదేవి, బాధితులతో మాట్లాడారు. అధికారులు, స్థానికులతో కూడిన ఓ కమిటీని ఏర్పాటు చేసినట్టు చెప్పారు. ఇందులో పి.ప్రదీప్‌కుమార్ (పరిశ్రమల శాఖ సహాయ సంచాలకుడు), ఆర్.త్రినాధ్, శేఖర్ (పరిశ్రమల తనిఖీ విభాగం), జి.స్వాతి (పర్యావరణ శాఖ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్), గ్రామస్తుల తరపున సీహెచ్ చినబాబు, బూలా అబ్బులు, ఎ.కృష్ణప్రసాద్, రెడ్డి నారాయణ, పెద్ది నాగలక్ష్మి వున్నారు. వారంతా పరిశ్రమ లోపల, బయట ఏం జరుగుతోందో తెలుసుకుంటారని చెప్పారు. ఏఏ పదార్థాలను వినియోగిస్తున్నారు... తద్వారా వచ్చే వ్యర్థ పదార్థాలు, వ్యర్థ నీటిని బయటకు తరలించేందుకు యాజమాన్యం ఏఏ చర్యలు చేపట్టిందో కమిటీ ద్వారా బహిర్గతమవుతుందన్నారు. పరిశ్రమ నుంచి దుర్వాసన వస్తోందా, వస్తే ఎంతమేర వెదజల్లుతుందో కమిటీ నిజ నిర్ధారణ చేస్తుందన్నారు. కమిటీ ఇచ్చిన నివేదిక ద్వారా పరిశ్రమ నిర్వాహకులపై తదుపరి చర్యలు ఉంటాయని కలెక్టర్ ప్రశాంతి పేర్కొన్నారు.


గుమ్మళ్లదొడ్డి గ్రామస్తులతో మాట్లాడుతున్న కలెక్టర్ ప్రశాంతి


ఎంపీటీసీ సత్యవతిని చుట్టుముట్టిన స్థానికులు

కాగా కలెక్టర్ వస్తున్నారని సమాచారం తెలుసుకున్న గుమ్మళ్లదొడ్డి, అచ్చుతాపురం, బావాజీపేట, వెదురుపాక గ్రామాలకు చెందిన వందలాది మంది ప్రజలు గుమ్మళ్లదొడ్డి చేరుకున్నారు. ఇథనాల్ పరిశ్రమ వల్ల పడుతున్న ఇబ్బందులను ఆమెకు స్వయంగా తెలియజేయాలనే కుతూహలాన్ని ప్రదర్శించారు. ఇప్పటికే అనేక మంది రోగాలబారిన పడ్డారని బాధితులు ఆమె దృష్టికి తీసుకెళ్లారు. జనావాసాల మధ్య ఏర్పాటుచేసిన పరిశ్రమను తక్షణం వేరే ప్రాంతానికి తరలించాలని కలెక్టర్‌ను వేడుకున్నారు.

కాగా తాము ఐదు రోజులుగా ఆందోళన చేస్తున్నా స్థానిక ఎంపీటీసీ పత్తా లేకుండా పోయారంటూ గ్రామస్తులు మండిపడ్డారు. కలెక్టర్ పర్యటన ముగిసిన అనంతరం అక్కడే ఉన్న ఎంపీటీసీ కోట సత్యవతిపై స్థానికులు తిరగబడ్డారు. పరిశ్రమ నిర్వహణను వ్యతిరేకిస్తూ ఉద్యమం చేస్తుంటే మీరు ఏమయ్యారని నిలదీశారు. అక్కడే ఉన్న పోలీసులు జోక్యం చేసుకుని ఎంపీటీసీని ఇంటికి పంపించేయడంతో వివాదం సద్దుమణిగింది.


కూనవరం క్రాస్‌రోడ్డు దగ్గర వాహనాలు వెళ్లకుండా పహారా కాసిన పోలీసులు, ఫారెస్టు అధికారులు

అదిగో పులి

బురదగూడెం పరిధిలో కనిపించిందన్న వీఆర్ పురం వాసులు

కూనవరం, అక్టోబరు 27 (ఆంధ్రజ్యోతి): ఇన్ని రోజులూ అడవిలో తిరిగిన పులి ఇప్పుడు బాహ్య ప్రపంచంలోకి అడుగుపెట్టింది. బురదగూడెం వద్ద పులి రోడ్డు దాటుతూ కనిపించిందని వీఆర్ పురం మండల వాసులు అటవీ శాఖ అధికారులకు తెలియజేశారు. దీంతో కూనవరం మండలంలో పులి తిరుగుతోందనేది వాస్తవమైంది. రాత్రి వేళలో చింతూరు, కూనవరం ఎటువంటి వాహనాలు తిరగకుండా ఎస్ఐ లతాశ్రీ, డీఎఫ్‌వో భవిత కూనవరం క్రాస్‌రోడ్డు వద్ద ఆదివారం అర్ధరాత్రి పహారా కాశారు. పోలీసులు, ఫారెస్టు అధికారులు ఎటువంటి వాహనాలు వెళ్లకుండా అడ్డుకున్నారు. ప్రజలు అప్రమత్తంగా ఉండాలని అధికారులు కోరారు.

బాలబాలాజీకి తిరుమంజన సేవ


అప్పనపల్లిలో రెండో రోజుకు పవిత్రోత్సవాలు

మామిడికుదురు, అక్టోబరు 27 (ఆంధ్రజ్యోతి): డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లా మామిడికుదురు మండలం అప్పనపల్లి బాలబాలాజీ ఆలయంలో పవిత్రోత్సవాలు ఆదివారం రెండో రోజుకు చేరుకున్నాయి. స్వామివారికి పంచామృతాలతో తిరుమంజన సేవను ఘనంగా నిర్వహించారు. ఉదయం సుప్రభాత సేవతో పాటు పలు పూజలు జరిపారు. 27 కలశలతో పంచామృతాలు, పదకొండు రకాల పండ్ల రసాలు, సుగంధ ద్రవ్యాలు, ఉధ్ధ జలాలతో స్నపన తిరుమంజన సేవ వేదపండితుల మంత్రోచ్ఛారణల నడుమ శాస్త్రోక్తంగా జరిగింది. ఆలయ సహాయ కమిషనరు ఎం.సత్యనారాయణరాజు ఆధ్వర్యంలో మునుపెన్నడూ లేని విధంగా పవిత్రోత్సవాలను కనుల పండువగా నిర్వహిస్తున్నారు. అధిక సంఖ్యలో భక్తులు వీక్షించి తీర్థ ప్రసాదాలు స్వీకరించారు. ఆదివారం వివిధ ఆర్జిత సేవలు, టిక్కెట్ల విక్రయాల ద్వారా రూ.1,586,949 ఆదాయం వచ్చిందని సహాయ కమిషనరు తెలిపారు. భక్తులకు ఏవిధమైన ఇబ్బంది కలగకుండా ఈవో, సిబ్బంది ఏర్పాట్లు చేశారు.




స్వామివారికి అభిషేకం చేస్తున్న అర్చకులు, హోమం జరిపిస్తున్న వేద పండితులు

సైసై జోడెడ్లా బండి

ఈ ఫొటోని చూస్తే జోడెద్దు వెళ్తున్నట్టు ఉంది కదూ... కానీ ఇవి నిజం ఎద్దులు కావు. కాకినాడ జిల్లా పరిషత్ సెంటరు నుంచి ఇంద్రపాలెం వైపు ఓ వాహనంపై వెళ్తున్నాయి. వెనుక భాగంలో ఆవు, దూడ ఉన్నాయి. వీటిని ఓ శుభ కార్యక్రమంలో ప్రదర్శనకు ఉంచేందుకు తీసుకెళ్తున్నారు. ఆకర్షణీయంగా ఉన్న ఈ రథాన్ని అటుగా వెళ్తున్న వారు ఆసక్తిగా తిలకించారు. మరికొందరైతే సెల్ఫీలు కూడా తీసుకున్నారు.

ఆంధ్రజ్యోతి- సర్పవరం జంక్షన్ (కాకినాడ)

శృంగేరి పీఠాధిపతి పర్యటన

మలికిపురం, అక్టోబరు 27(ఆంధ్రజ్యోతి): శృంగేరి పీఠాధిపతి శ్రీశ్రీ విధుశేఖరభారతి మహాస్వామి గుడిమెళ్లంక పర్యటన సందర్భంగా ఏర్పాట్లను రాజోలు ఎమ్మెల్యే దేవ వరప్రసాద్ పరిశీలించారు. ఈసందర్భంగా ఎమ్మెల్యే దేవ గుడిమెళ్లంక శివాలయాన్ని దర్శించుకుని స్వామివారికి పూజలు చేశారు.

అన్నసమారాధన

అంబాజీపేట, అక్టోబరు 27(ఆంధ్రజ్యోతి): స్థానిక శ్రీనివాస్‌నగర్‌లో ఉన్న శ్రీవిజయభేతాళ స్వామి ఆలయం వద్ద భారీ అన్నసమారాధన నిర్వహించారు. ప్రతి ఏటా విజయభేతాళ ఉత్సవం అనంతరం అన్నసమారాధన నిర్వహిస్తారు. 13పాలాలకు చెందిన సంఘీయులు, శెట్టిబలిజ అభ్యుదయ సంఘ సభ్యులు పాల్గొన్నారు.

ముంపు సమస్య పరిష్కారానికి చర్యలు


మెండుపాలెంలో ముంపు ప్రాంతాల్లో నీరు తొలగిస్తున్న పనులు పరిశీలిస్తున్న ఎమ్మెల్యే దేవ వరప్రసాద్

అంతర్వేది, అక్టోబరు 27(ఆంధ్రజ్యోతి): కేశవదాసుపాలెం గ్రామం మెండుపాలెం ముంపు ప్రాంతాలను ఎమ్మెల్యే దేవ వరప్రసాద్ ఆదివారం పరిశీలించారు. ముంపునకు గురవుతున్న తీర ప్రాంతాల గ్రామాలను రక్షించేందుకు ముంపు నీటిని సముద్రంలోకి తరలించే చర్యలు చేపడుతున్నట్టు తెలిపారు. తీర ప్రాంత గ్రామాలైన అంతర్వేది పల్లిపాలెం, అంతర్వేది, కేశవదాసుపాలెం, చింతలమోరి గ్రామాల్లోకి చొచ్చుకు వస్తున్న నీటితో తరచూ సమస్యలు తలెత్తుతున్నాయని ప్రజలు తెలపడంతో ఎమ్మెల్యే దేవ వరప్రసాద్ ముంపునకు గురవుతున్న డ్రెయిన్లను ఆదివారం పరిశీలించి పూర్తిస్థాయి చర్యలు తీసుకుంటామని ప్రజలకు హామీ ఇచ్చారు. ఎడతెరిపి లేకుండా కురిసిన వర్షాలు, ఆక్వా చెరువులు, డ్రెయిన్ల ఆక్రమణలు పెరగడం, పూడిక తీయించకపోవడం మొదలగు కారణాల వల్ల తీర ప్రాంత గ్రామాల్లో పొలాలు మునిగిపోతున్నాయని, ఇళ్ల చుట్టూ నీరుచేరి దుర్వాసనతో ప్రజలు సమస్యలు ఎదుర్కొంటున్నారని, వారి సమస్యలను పరిష్కరిస్తామని చెప్పారు. మెండుపాలెంలో సముద్రంలోకి ముంపు పోవడానికి స్ట్రెయిట్ కట్ తవ్వుతున్న పనులను ఎమ్మెల్యే వరప్రసాద్ పరిశీలించారు. వర్షాకాలం ముంపునకు గురైతే జనవరి వరకు ముంపులోనే తీరప్రాంత గ్రామాలు మగ్గుతున్నాయని ప్రజలు వాపోయారు. ముంపునకు గురవ్వకుండా తీర ప్రాంత గ్రామాలను రక్షించడానికి ప్రత్యామ్నాయ మార్గాలను ఏర్పాటు చేశామని తెలిపారు. కార్యక్రమంలో మార్క్‌ఫెడ్ డైరెక్టర్ గుండుబోగుల పెద్దకాపు, గెడ్డం మహాలక్ష్మి ప్రసాద్, ముప్పర్తి నాని, గుబ్బల ఫణికుమార్, ఉండపల్లి అంజి, యెనుముల రమణ, యెనుముల తాతాజీ, సర్పంచ్ మేడిద సరోజిని, జిల్లెల్ల నరసింహ, కూటమి శ్రేణులు పాల్గొన్నారు.

జర్నలిస్టుల సంక్షేమానికి కూటమి ప్రభుత్వం కృషి


మాట్లాడుతున్న ఎమ్మెల్యే ఆనందరావు

అమలాపురం టౌన్, అక్టోబరు 27(ఆంధ్రజ్యోతి): జర్నలిస్టుల సంక్షేమానికి కూటమి ప్రభుత్వం పెద్దపీట వేస్తుందని అమలాపురం ఎమ్మెల్యే అయితాబత్తుల ఆనందరావు చెప్పారు. ఆంధ్రప్రదేశ్ మీడియా ఫెడరేషన్ జిల్లాశాఖ ప్రథమ మహాసభ ఆదివారం కిమ్స్ వైద్య కళాశాల కాన్ఫరెన్సు హాలులో నిర్వహించారు. ముఖ్య అతిథిగా హాజరైన ఎమ్మెల్యే ఆనందరావు మాట్లాడుతూ పనిచేస్తున్న ప్రతీ జర్నలిస్టుకు అక్రిడిటేషన్ ఇప్పించేందుకు కృషి చేస్తానన్నారు. గతంలో ఇళ్ల స్థలాలు పొందని జర్నలిస్టులకు ఇళ్ల స్థలాలు అందిస్తామన్నారు. ఎమ్మెల్సీ బొమ్మి ఇజ్రాయిల్ మాట్లాడుతూ వచ్చే శీతాకాల సమావేశాల్లో జర్నలిస్టుల సమస్యలను శాసనమండలి దృష్టికి తీసుకువస్తానన్నారు. జర్నలిస్టుల రక్షణ కోసం ఒక ప్రత్యేక చట్టం అవసరమని శాసనమండలి మాజీ డిప్యూటీ చైర్మన్ రెడ్డి సుబ్రహ్మణ్యం అన్నారు. మహాసభకు ఏపీఎంఎఫ్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పి.ఢిల్లీబాబురెడ్డి అధ్యక్షత వహించి మాట్లాడారు. మహాసభలో బీజేపీ జిల్లా అధ్యక్షుడు యాళ్ల దొరబాబు, యూనియన్ జాతీయ ఉపాధ్యక్షుడు చెల్లుబోయిన శ్రీనివాస్, మున్సిపల్ చైర్మన్ రెడ్డి సత్యనాగేంద్రమణి, టీడీపీ రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి మెట్ల రమణబాబు, రాష్ట్ర నాయకులు పెచ్చెట్టి చంద్రమౌళి, నామన రాంబాబు, బోళ్ల వెంకటరమణ, మోకా వెంకటసుబ్బారావు, నాయకులు బొర్రా ఈశ్వరరావు, చిలువూరి సతీష్‌రాజు, కంచిపల్లి అబ్బులు, టీడీపీ మీడియా కోఆర్డినేటర్ బోళ్ల సతీష్‌బాబు మాట్లాడారు. అనంతరం నిర్వహించిన జిల్లా కమిటీ ఎన్నికలకు మల్లి కార్జున్ రిటర్నింగ్ అధికారిగా వ్యవహరించారు.

సీఎంతో జీఎన్ నాయుడు భేటీ



యానాం, అక్టోబరు 27 (ఆంధ్రజ్యోతి): యానాంలో రీజెన్సీ పరిశ్రమకు సంబంధించిన పలు పెండింగ్ అంశాలపై పుదుచ్చేరి ముఖ్యమంత్రి ఎన్.రంగసామితో రీజెన్సీ సంస్థల చైర్మన్ డాక్టర్ జీఎన్ నాయుడు సమావేశమ య్యారు. ఈమేరకు అసెంబ్లీలోని సీఎం కార్యాలయానికి వెళ్లారు. ముఖ్యంగా రీజెన్సీకి సహజ వాయువు సరఫరా అంశంతో పాటు పెం డింగ్‌లో ఉన్న అన్ని అంశాలను పరిష్కరించాలని సీఎంను కోరారు. దీనిపై సీఎం స్పందించి అత్యున్నత స్థాయి సమావేశాన్ని నిర్వహించి అన్ని సమస్యలను పరిష్కరించేలా కృషి చేస్తానని సీఎం తెలిపినట్లు జీఎన్ నాయుడు తెలిపారు. రీజెన్సీ సంస్థల మేనేజింగ్ డైరెక్టర్ డాక్టర్ ఎన్.సత్యేంద్రప్రసాద్ పాల్గొన్నారు.

చెకుముకి సంబరాలు

మలికిపురం, అక్టోబరు 27(ఆంధ్రజ్యోతి): మలికిపురంలో నిర్వహించిన జిల్లాస్థాయి చెకుముకి పోటీల్లో ప్రభుత్వ పాఠశాల విభాగం నుంచి వానపల్లి జిల్లాపరిషత్ ఉన్నత పాఠశాల ప్రథమ స్థానంలో నిలవగా ప్రైవేటు పాఠశాలల నుంచి కొత్తపేట భాష్యం స్కూల్ జిల్లా స్థాయిలో ప్రథమ స్థాయిలో నిలిచి రాష్ట్రస్థాయి పోటీలకు అర్హత సాధించింది. ఈపోటీల్లో జిల్లా నలుమూలల నుంచి ప్రభుత్వ, ప్రైవేటు పాఠశాలల నుంచి 50బృందాలు పాల్గొన్నాయి. విజేతలు రాష్ట్రస్థాయిలో విశాఖపట్నంలోజరిగే పోటీల్లో పాల్గొంటారు. జిల్లా సైన్స్ ఆఫీసర్ జీవీఎస్ సుబ్రహ్మణ్యం, కరస్పాండెంట్ ఎంవీ సత్యనారాయణ, మలికిపురం ఎంఈవోలు ఎం. విజయశ్రీ, వైవీసత్యనారాయణ పాల్గొన్నారు.

రత్నాకర్ మరిన్ని రచనలు చేయాలి


గౌతమీ నది తీరాన పుస్తక ఆవిష్కరణ చేస్తున్న మల్లాడి

యానాం, అక్టోబరు 27 (ఆంధ్రజ్యోతి): యానాం రచయిత రత్నాకర్ పెనుమాక మరిన్ని రచనలు చేపట్టాలని పుదుచ్చేరి ప్రభుత్వ ఢిల్లీ ప్రత్యేక ప్రతినిధి మల్లాడి కృష్ణారావు అన్నారు. ఆదివారం సాయంత్రం స్థానిక భీమ్‌నగర్‌లో రత్నాకర్ రెండో కథా సంపుటి ఆవిష్కరణ కార్యక్రమం నిర్వహించారు. ఈసభకు ప్రముఖ కవి దాట్ల దేవదానం రాజు అధ్యక్షత వహించగా ముఖ్యఅతిథిగా మల్లాడి కృష్ణారావు హాజరై గౌతమీ నది తీరాన పుస్తకాన్ని ఆవిష్కరించారు. తొలి ప్రతిని పోనుగుమట్ల విష్ణుమూర్తికి అందజేశారు. ఈసందర్భంగా మల్లాడి మాట్లాడుతూ భవిష్యత్‌లో రత్నాకర్ మరిన్ని రచనలు చేయాలన్నారు. అందుకు అవసరమయ్యే సహకారం అందిస్తానన్నారు. యానాంలో కవులకు సంబంధించిన సమావేశాలను నిర్వహించేకునేందుకు ప్రభుత్వ నుంచి స్థలం కేటాయించాలని కోరుతున్న నేపథ్యంలో ముఖ్యమంత్రితో మాట్లాడి యానాం ప్రభుత్వ సమావేశాపు హాల్ సమావేశాలు నిర్వహించుకునేలా చర్యలు తీసుకుంటానన్నారు. ఇటీవల ప్రపంచస్థాయి కథల పోటీ ప్రథమ బహుమతి పొందడమే కాకుండ రత్నాకర్ కథను ఆంధ్రప్రదేశ్ అంతటా డిగ్రీ ఫైనలియర్ పాఠ్యాంశంగా ఎంపిక కావడంతో రత్నాకర్‌ను మల్లాడి అభినందించారు. అనంతరం కార్యక్రమాన్ని ఉద్దేశించి కవులు దాట్ల దేవదానం రాజు, పోనుగుమట్ల విష్ణుమూర్తి, ముధునాపంతుల సత్యనారాయణమూర్తి, ఆవధానుల మణిబాబులు, రత్నజయ్ మాట్లాడారు.

కాపులకు న్యాయం చేయాలి


సమావేశమైన కాపుసంఘ నాయకులు

ముమ్మిడివరం, అక్టోబరు 27(ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం అధికారంలోకి రావడానికి విశేష కృషి చేసిన కాపులకు న్యాయం చేయడానికి ప్రభుత్వం కృషి చేయాలని జాతీయ కాపు సంఘ అధ్యక్షుడు కర్ల మురళీకృష్ణనాయుడు కోరారు. ముమ్మిడివరం మండలం సీహెచ్ గున్నేపల్లి గ్రామంలో ఆదివారం జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడారు. కాపులకు ఉద్యోగాల కల్పనలో ఐదు శాతం రిజర్వేషన్లు కల్పించాలని, కాపుల అభివృద్ధికి కాపు కార్పొరేషన్‌కు రూ.1500కోట్లు కేటాయించాలని ఆయన డిమాండు చేశారు. 125నియోజకవర్గాల్లో గెలుపు, ఓటములను నిర్దేశించే స్థితిలో కాపులు ఉన్నారన్నారు. రానున్న ఎన్నికల్లో పవన్‌కల్యాణ్‌ను ముఖ్యమంత్రి చేసేందుకు కృషి చేస్తామన్నారు. సన్నకారు, చిన్నకారు, కౌలు రైతులు ఎక్కువ శాతం కాపు కులస్తులేనని, వారిని ఆదుకునేందుకు ప్రభుత్వం దృష్టి సారించాలన్నారు. రాష్ట్ర రైతు విభాగం అధ్యక్షుడు బసవా చిన్నబాబు, సంఘ రాష్ట్ర మహిళా అధ్యక్షురాలు వెంకటలక్ష్మి, జిల్లా అధ్యక్షుడు గొలకోటి వెంకటరెడ్డి పాల్గొన్నారు.

ప్రగతి నారీ సంఘం మండల కమిటీ ఎన్నిక

అమలాపురం రూరల్, అక్టోబరు 27(ఆంధ్రజ్యోతి): కామనగరువు కరక్కాయపేటలో ఆదివారం ప్రగతి నారీ సంఘం రాష్ట్ర అధ్యక్షురాలు బి.పద్మావతి ఆధ్వర్యంలో సమావేశం నిర్వహించారు. సమాజంలో మహిళలు ఎదుర్కొంటున్న సమస్యలపై పీఎన్ఎస్ ఆధ్వర్యంలో నిరంతర పోరాటాలు నిర్వహిస్తామన్నారు. రాష్ట్ర ఇన్‌చార్జి ఎం.నాగమణి, పద్మల ఆధ్వర్యంలో మండల కమిటీని ఎన్నుకున్నారు. అధ్యక్షురాలిగా సీహెచ్ విజయలక్ష్మి, కార్యదర్శిగా జిత్తుక వెంకటలక్ష్మితో పాటు కార్యవర్గ సభ్యులుగా టి.లక్ష్మి, ఎన్.నాగమణిదేవి, ఎన్.లక్ష్మి, టి.విజయలక్ష్మి, జి.స్వప్న, కె.సీతారత్నం, జి.కృష్ణవేణి, పి.విజయలక్ష్మిలను ఎన్నుకున్నారు. మహిళలపై జరుగుతున్న అత్యాచారాలు, దాడులు, వివక్షతకు వ్యతిరేకంగా నవంబరు 1 నుంచి 5వరకు రాష్ట్ర వ్యాప్తంగా నిర్వహించే రౌండ్ టేబుల్ సమావేశాల కార్యాచరణపై కరపత్రాలను పద్మావతి ఆవిష్కరించారు.

ముమ్మిడివరంలో భారీ వర్షం

ముమ్మిడివరం, అక్టోబరు 27(ఆంధ్రజ్యోతి): ముమ్మిడివరంలో ఆదివారం మధ్యాహ్నం భారీ వర్షం కురిసింది. ఆకాశం ఒక్కసారిగా మేఘావృతమై మధ్యాహ్నం 3.30 నుంచి 5 గంటల వరకు ఏకధాటిగా వర్షం కురవడంతో రోడ్లన్నీ నీట మునిగాయి. దీంతో ఎక్కడ వాహనాలు అక్కడే నిలిచిపోయాయి. పట్టణంలో డ్రైనేజీ వ్యవస్థ సక్రమంగా లేకపోవడంతో నీరు బయటకు వెళ్లే మార్గం లేక ఎక్కడనీరు అక్కడే రోడ్డుపై నిలబడిపోయింది. దీంతో రోడ్లన్నీ చెరువును తలపించాయి. ముమ్మిడివరంలో ఆసుపత్రుల వీధి, టెలిఫోన్ ఎక్స్ఛేంజ్‌వీధి, కుమ్మరివీధి, బాలాజీకాన్వెంట్ వీధి, గంటావారి వీధి, తహసీల్దార్, పోలీసుస్టేషన్, సబ్‌ట్రెజరీ కార్యాలయాల ఆవరణ నీట మునిగాయి. భారీ వర్షానికి మురుగునీటి కాల్వలు, పంట కాల్వలు పొంగి ప్రవహించాయి. పలు కాలనీలు, జగనన్న కాలనీల్లోని అంతర్గత రోడ్లు, లోతట్టు ప్రాంతాలు వర్షం నీటితో మునిగాయి.

పిచ్చికుక్క దాడిలో ఆరు పాడి గేదెలకు గాయాలు

అల్లవరం అక్టోబరు 27(ఆంధ్రజ్యోతి): కొమరగిరిపట్నంలో ఆదివారం పిచ్చికుక్క దాడిలో ఆరు పాడి గేదెలు గాయాల పాలయ్యాయి. పిచ్చికుక్క స్వైర విహారం చేసి పాడి గేదెలను కరవడంతో పాడి రైతులు తీవ్ర ఆందోళనకు గురయ్యారు. దీనిపై సమాచారం అందుకున్న గోడి పశు సంవర్ధక శాఖ అసిస్టెంట్ వినయ్ వెళ్లి గేదెలను వ్యాక్సిన్ వేశారని మండల పశువైద్యాధికారి డాక్టర్ మేడిద నారాయణరావు తెలిపారు. పిచ్చికుక్క బారిన పడిన గేదెలకు యాంటీ రేబిస్ వ్యాక్సిన్ వేశారని, సోమవారం వెళ్లి వాటిని పరిశీలిస్తానని డాక్టర్ నారాయణరావు తెలిపారు.

రూ.50వేలు విరాళం

అంతర్వేది, అక్టోబరు 27(ఆంధ్రజ్యోతి): అంతర్వేది శ్రీలక్ష్మీనరసింహ స్వామివారి ఆలయంలో నిర్వహించే శ్రీనారసింహ సుదర్శన హోమానికి సంవత్సరానికి రూ.40 వేలు, ఆరు నెలలు నిత్య అభిషేకానికి రూ.10వేలును కోరుకొండకు చెందిన పుల్లెపు త్రిమూర్తులు ఆదివారం విరాళాన్ని సహాయ కమిషనర్ వి.సత్యనారాయణకు అందించినట్టు తెలిపారు.

ప్రభుత్వ భూమిని ప్రజా అవసరాలకు వాడాలి

మలికిపురం, అక్టోబరు27(ఆంధ్రజ్యోతి): అడివిపాలెంలో సర్వే ద్వారా గుర్తించిన ప్రభుత్వ భూమిని ప్రజా అవసరాలకు వినియోగించాలని బహుజన సమాజ్ పార్టీ మానవహక్కుల వేదిక చైతన్య సమితి నాయకులు డిమాండ్ చేశారు. సర్వేలో గుర్తించిన మిగులు భూమి పేదలకు, ప్రజా అవసరాలకు వినియోగించాలని, అక్రమంగా కబ్జాచేసిన భూమిని స్వాధీనం చేసుకోవాలని కోరారు. పి.జాన్‌మోషే, ఎం.శ్రీను, ముత్యాల శ్రీనివాసరావు, చవ్వాకుల వెంకట్, చింతా సత్య పాల్గొన్నారు.

సిద్ధివినాయకుని ఆదాయం రూ.2.44లక్షలు

అయినవిల్లి, అక్టోబరు 27(ఆంధ్రజ్యోతి): అయినవిల్లి శ్రీసిద్ధివినాయకునికి ఆదివారం రూ.2,44,432 ఆదాయం వచ్చింది. పంచామృత అభిషేక లఘున్యాసం 100, ఉండ్రాళ్ల పూజలు ఏడు, ప్రత్యేక దర్శనాలు 488, లక్ష్మీగణపతి హోమాలు 14, నామకరణాలు ఒకటి, అక్షరాభ్యాసాలు ఐదు, అన్నప్రాసనలు తొమ్మిది, తులాభారాలు ఏడు, కేశఖండన నాలుగు, వాహన పూజ నాలుగు చక్రాలు 21, ద్విచక్ర వాహనపూజలు 58, కొబ్బరికాయలు మొక్కుబడి 18, ముఖమండప ప్రత్యేక పూజలు రెండు, సరస్వతీ సహిత సప్తనదీ జలాభిషేకం 27, పులిహోర 1449, లడ్డూ 2189, అన్నప్రసాదం 1820, అన్నప్రసాద విరాళం రూ.88,143, విరాళాలు రూ.6వేలు, మొత్తం ఆదాయం రూ.2,44,432 వచ్చినట్టు ఆలయ కార్యనిర్వహణాధికారి ముదునూరి సత్యనారాయణరాజు తెలిపారు.

నరేంద్రపురంలో చోరీ

పి.గన్నవరం, అక్టోబరు 27(ఆంధ్రజ్యోతి): తాళం వేసిన ఇంటిలో చోరీ జరిగింది. నరేంద్రపురానికి చెందిన విశ్రాంత పోస్టు మాస్టర్ గరిమెళ్ల సీతారామశర్మ సోదరుడుమల్లికార్జునరావు ఇంట్లో నివాసం ఉంటున్నారు. అయితే ఆయన ఇంటికి తాళం వేసి ఇటీవల హైదరాబాదు వెళ్లారు. ఇంటి ఎదురుగా ఉంటున్న సీతారా మశర్మ మరోసోదరుడు వెంకటసూర్యసుబ్రహ్మణ్యం ఆదివారం ఉదయం ఇంటి తాళాలు పగలుగొట్టి ఉండటాన్ని గమనించారు. వెంటనే ఆయన సోదరుడికి సమాచారం అందించడంతో పాటు పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఎస్ఐ బి.శివకృష్ణ ఆధ్వర్యంలో చోరీకి గురైన ప్రాంతాన్ని క్లూస్ టీమ్‌తో పరిశీలన చేశారు. బీరువాలో ఉంచిన 425గ్రాముల వెండి వస్తువులు గుర్తుతెలియని వ్యక్తులు చోరీ చేసినట్లు గుర్తించారు. కేసు నమోదుచేసినట్లు ఎస్ఐ తెలిపారు.

టీడీపీకి మహిళల్లో మంచి ఆదరణ

పి.గన్నవరం, అక్టోబరు27(ఆంధ్రజ్యోతి): టీడీపీకి మహిళల్లో మంచి ఆదరణ ఉందని, సభ్యత్వాల నమోదులో వారు భాగస్వాములు అవుతున్నారని టీడీపీరాష్ట్ర కార్యనిర్వాహక కార్య దర్శి డొక్కా నాథ్‌బాబు అన్నారు. మొండెపులంకలో జరిగిన టీడీపీ సభ్యత్వాల నమోదు కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. సభ్యత్వాల నమోదును త్వరితగతిన పూర్తిచేయాలని కార్యకర్తలను కోరారు. గ్రామానికి చెందిన పలువురు మహిళలు, నాయకులు, కార్యకర్తలకు టీడీపీ సభ్యత్వాలు అందించారు. అరు మిల్లి లాల్‌బాబు, ఆరుమిల్లి సాయిబాబు, కడలి సాయిబాబు, కడలి నరసింహమూర్తి, ఉండ్రాజవరపు బాబీ, అంచూరి రమేష్ పాల్గొన్నారు.

నగర పంచాయతీ కార్యాలయం ఎదుట ధర్నా

ముమ్మిడివరం, అక్టోబరు 27(ఆంధ్రజ్యోతి): సమస్యలు పరిష్కరించాలని కోరుతూ సీఐటీయూ ఆధ్వర్యంలో నగర పంచాయతీ కార్మికులంతా ముమ్మిడివరం కార్యాలయం ఎదుట ఆదివారం ధర్నా నిర్వహించారు. పట్టణాల విస్తరణ మేరకు కార్మికుల సంఖ్య పెంచాలని, పనిముట్లు, రక్షణ పరికరాలు, సౌకర్యాలు కల్పించాలని డిమాండు చేశారు. అనంతరం వినతిపత్రాన్ని చైర్మన్ కమిడి ప్రవీణ్‌కుమార్‌కు అందజేశారు. కూటమి ప్రభుత్వం వెంటనే కార్మికుల డిమాండ్లు పరిష్కరించాలని వారు కోరారు. కార్యక్రమంలో నిమ్మకాయల వెంకటేష్, బుంగ కుమార్, ఎం.భార్గవరాజు, మాణిక్యం, కొండయ్య, బి.లక్ష్మణ్, పి.నాగలక్ష్మి పాల్గొన్నారు.

రాష్ట్రంలో మొదటి స్థానానికి చేరుకోవాలి

మామిడికుదురు, అక్టోబరు 27(ఆంధ్రజ్యోతి): సభ్యత్వ నమోదులో పి.గన్నవరం నియోజకవర్గం రాష్ట్రంలోనే మొదటి స్థానంలో నిలపాలని జడ్పీ మాజీ చైర్మన్ నామన రాంబాబు ఆకాంక్షించారు. లూటుకుర్రు టీడీపీ రాష్ట్ర వాణిజ్య విభాగం కార్యదర్శి బోనం బాబు స్వగృహం వద్ద ఆదివారం జరిగింది. కార్యక్రమంలో రాంబాబు మాట్లాడుతూ ప్రతీ కార్యకర్త విధిగా సభ్యత్వాలు తీసుకోవాలని సూచించారు. ప్రతీ నాయకుడు సభ్యత్వాలను ఎక్కువ చేయించేలా కృషి చేయాలన్నారు. సభ్యత్వం తీసుకున్న సభ్యులకు పత్రాలు అందించారు. మండల అధ్యక్షుడు మొల్లేటి శ్రీనివాస్, కార్యదర్శి వర్ధినేని బాబ్జి, ఎంపీటీసీ నామన వెంకటేశ్వరరావు, నాయకులు కడలి నూకరాజు, చుట్టుగుళ్ల కిశోర్, చిట్టూరి సత్యనారాయణ, చుట్టుగుళ్ల దుర్గాదేవి, పొన్నమండ పెద్దిరాజు పాల్గొన్నారు.

శృంగేరి పీఠాధిపతి పర్యటన

మలికిపురం, అక్టోబరు 27(ఆంధ్రజ్యోతి): శృంగేరి పీఠాధిపతి శ్రీశ్రీశ్రీ విధుశేఖరభారతి మహాస్వామి గుడిమెళ్లంక పర్యటన సందర్భంగా ఏర్పాట్లను రాజోలు ఎమ్మెల్యే దేవ వరప్రసాద్ పరిశీలించారు. ఈసందర్భంగా ఎమ్మెల్యే దేవ గుడిమెళ్లంక శివాలయాన్ని దర్శించుకుని స్వామివారికి పూజలు చేశారు.

అన్నసమారాధన

అంబాజీపేట, అక్టోబరు 27(ఆంధ్రజ్యోతి): స్థానిక శ్రీనివాస్‌నగర్‌లో ఉన్న శ్రీవిజయబేతాళ స్వామి ఆలయం వద్ద భారీ అన్నసమారాధన నిర్వహించారు. ప్రతి ఏటా విజయబేతాళ ఉత్సవం అనంతరం అన్నసమారాధన నిర్వహిస్తారు. 13పాలాలకు చెందిన సంఘీయులు, శెట్టిబలిజ అభ్యుదయ సంఘ సభ్యులు పాల్గొన్నారు.

భక్తులకు సౌకర్యాలు కల్పించడమే లక్ష్యం




అభివృద్ధి పనులకు శంకుస్థాపన చేస్తున్న ఎమ్మెల్యే బండారు, కేశఖండన శాలను ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే

ఎమ్మెల్యే బండారు సత్యానందరావు

ఆత్రేయపురం, అక్టోబరు 27(ఆంధ్రజ్యోతి): కోరిన కోర్కెలు తీర్చే కలియుగ దైవంగా విరజిమ్ముతున్న వాడపల్లి శ్రీవేంకటేశ్వస్వామి పుణ్యక్షేత్రంలో తరలివచ్చే భక్తులకు సకల సౌకర్యాలు కల్పించడమే ప్రభుత్వ లక్ష్యమని కొత్తపేట ఎమ్మెల్యే బండారు సత్యానందరావు పేర్కొన్నారు. ఆదివారం దేవస్థానం పరిధిలోని కోట్లాది రూపాయలతో చేపట్టిన అభివృద్ధి పనులకు శంకుస్థాపనలు, ప్రారంభోత్సవాలు నిర్వహించారు. పార్కింగ్, గోశాల, టాయిలెట్స్, ఫ్లోరింగ్ తదితర పనులకు ఆయన శంకుస్థాపన నిర్వహించి రూ.1.11కోట్లతో నిర్మించనున్న కాంపౌండ్ వాల్ డార్మిటేరి హాల్ నిర్మాణ పనులకు శంకుస్థాపన చేసి కేశఖండన శాలను ప్రారంభించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ మాస్టర్‌ప్లాన్ ప్రకారం ఆలయ అభివృద్ధికి ప్రత్యేక చర్యలు చేపడుతున్నట్లు తెలిపారు. భక్తులకు పూర్తిసౌకర్యాలు కల్పించడమే లక్ష్యమన్నారు. కార్యక్రమంలో ఆలయ ఉపకమిషనరు నల్లం సూర్యచక్రధరరావు, ముదునూరి వెంకట్రాజు, కాయల జగన్నాధం, కంఠంశెట్టి శ్రీనివాస్, యేపుగంటి వెంకటేశ్వరరావు, కూటమి పార్టీల నాయకులు పాల్గొన్నారు.

జవాన్ శ్రీనివాస్ త్యాగాలు చిరస్మరణీయం




శ్రీనివాస్ విగ్రహానికి సెల్యూట్ చేస్తున్న ఎస్ఐ జానీబాషా. కుటుంబ సభ్యులతో సీఐ అశోక్‌కుమార్, ఎస్ఐ

కె.గంగవరం, అక్టోబరు 27(ఆంధ్రజ్యోతి): సరిహద్దుల్లో ప్రాణాలుర్పించిన వీర జవానుల త్యాగాలు చిరస్మరణీయమని రామచంద్రపురం సీఐ కె.అశోక్‌కుమార్, పామర్రు ఎస్ఐ ఎస్.కె. జానీ బాషా అన్నారు. అమరవీరుల సంస్మరణ దినోత్సవాల్లో భాగంగా ఆదివారం పేకేరు శివారు భీమ్‌నగర్‌లో అమరజవాన్ పిట్ల శ్రీనివాస్ కుటుంబ సభ్యులు భార్య శ్రీలక్ష్మి, కుమార్తెలు సుమనశ్రీ, శ్రీలత, కుమారుడు సాక్షత్‌ను వారు కలిసారు. శ్రీనివాస్ చైనా బోర్డర్‌లో బాధ్యతలు నిర్వహిస్తూ దేశానికి చేసిన సేవలు గుర్తు చేసుకున్నారు. శ్రీనివాస్ త్యాగాలను స్మరించుకున్నారు. శ్రీనివాస్ చిత్రపటానికి, విగ్రహానికి సీఐ, ఎస్ఐలు నివాళులర్పించారు. అమరవీరుల కుటుంబాలకు అండగా ఉంటామని భరోసా ఇచ్చారు. భీమ్‌నగర్ గ్రామస్తులు పాల్గొన్నారు.

సిద్ధివినాయకుని ఆదాయం రూ.2.44లక్షలు

అయినవిల్లి, అక్టోబరు 27(ఆంధ్రజ్యోతి): అయినవిల్లి శ్రీసిద్ధివినాయకునికి ఆదివారం రూ.2,44,432 ఆదాయం వచ్చింది. పంచామృత అభిషేక లఘున్యాసం 100, ఉండ్రాళ్ల పూజలు ఏడు, ప్రత్యేక దర్శనాలు 488, లక్ష్మీగణపతి హోమాలు 14, నామకరణాలు ఒకటి, అక్షరాభ్యాసాలు ఐదు, అన్నప్రాసనలు తొమ్మిది, తులాభారాలు ఏడు, కేశఖండన నాలుగు, వాహన పూజ నాలుగు చక్రాలు 21, ద్విచక్ర వాహనపూజలు 58, కొబ్బరికాయలు మొక్కుబడి 18, ముఖమండప ప్రత్యేక పూజలు రెండు, సరస్వతీ సహిత సప్తనదీ జలాభిషేకం 27, పులిహోర 1449, లడ్డూ 2189, అన్నప్రసాదం 1820, అన్నప్రసాద విరాళం రూ.88,143, విరాళాలు రూ.6వేలు, మొత్తం ఆదాయం రూ.2,44,432 వచ్చినట్టు ఈవో ముదునూరి సత్యనారాయణరాజు తెలిపారు.

టీడీపీకి మహిళల్లో మంచి ఆదరణ

పి.గన్నవరం, అక్టోబరు 27(ఆంధ్రజ్యోతి): టీడీపీకి మహిళల్లో మంచి ఆదరణ ఉందని, సభ్యత్వాల నమోదులో వారు భాగస్వాములు అవుతున్నారని టీడీపీరాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి డొక్కా నాథ్‌బాబు అన్నారు. మొండెపులంకలో జరిగిన టీడీపీ సభ్యత్వాల నమోదు కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. సభ్యత్వాల నమోదును త్వరితగతిన పూర్తిచేయాలని కార్యకర్తలను కోరారు. గ్రామానికి చెందిన పలువురు మహిళలు, నాయకులు, కార్యకర్తలకు టీడీపీ సభ్యత్వాలు అందించారు. ఆరుమిల్లి లాల్‌బాబు, ఆరుమిల్లి సాయిబాబు పాల్గొన్నారు.

ప్రమాదాలకు నిలయం.. అంతర్ రాష్ట్ర కూరగాయల మార్కెట్

- డివైడర్ కోసం రైతుల పట్టు
- వందలాది వాహనాలు వచ్చే చోట డివైడర్ ఏర్పాటుకు చర్యలు చేపట్టాలని వ్యాపారుల డిమాండ్
- గోదావరి జిల్లాలు, తెలంగాణ, ఒడిసా, పశ్చిమబంగా ప్రాంతాల నుంచి కూరగాయలు ఎగుమతి, దిగుమతులు
- కొనుగోలు చేసిన కూరగాయలను కడియం, పొట్టిలంక వైపునకు రాంగ్ రూట్‌లో తరలింపుతో ప్రమాదాలు




మడికి వద్ద అంతర్‌రాష్ట్ర కూరగాయల మార్కెట్, మార్కెట్ వద్ద వాహనాలు రాకపోకలు

ఆలమూరు, అక్టోబరు27(ఆంధ్రజ్యోతి): డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లా ఆలమూరు మండలం మడికి అంతర్రాష్ట్ర కూరగాయల మార్కెట్‌కు రాకపోకలు సాగించడానికి రైతులు, కొనుగోలుదారులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. అనేక ప్రమాదాలు జరిగి కొంత మంది ప్రాణాలు కోల్పోగా మరి కొంతమంది క్షతగాత్రులుగా మిగిలారు. మార్కెట్ వద్ద రాకపోకలకు డివైడర్ లేకపోవడంతో ప్రమాదాలు జరుగుతున్నాయి. జాతీయ రహదారిపై మడికి సెంటర్ నుంచి కడియం మండలం పొట్టిలంక వరకు డివైడర్ లేదు. అయితే ఈమధ్యలో అంత రాష్ట్ర కూరగాయల మార్కెట్ ఉంది. దీంతో రావులపాలెం వైపు నుంచి వచ్చే రైతులు వారి పండించిన పంటలను మోటార్ సైకిల్, ఆటోల ద్వారా మడికి నుంచి రాంగ్ రూట్‌లో మార్కెట్‌కు చేరుకోవాల్సి ఉంటుంది. ఈసమయంలోనే అధికంగా ప్రమాదాలు జరుగుతున్నాయి. అంతేకాదు మార్కెట్‌లో కొనుగోలు చేసిన కూరగాయలను కడియం, పొట్టిలంక వైపునకు రాంగ్ రూట్‌లోనే తీసుకెళుతున్నారు. ఈసమయంలో కూడా ప్రమాదాలు జరుగుతున్నాయి. ఈప్రమాదాల నివారణకు జాతీయ రహదారి అధికారులు పలుమార్లు పరిశీలన జరిగినప్పటికీ ఏమీ చేయలేకపోతున్నారు. రైతులు, కొనుగోలుదారులు మార్కెట్ ఎదురుగా రాకపోకలకు డివైడర్ సౌకర్యం కల్పించాలని ఎన్నో ఏళ్లుగా కోరుతున్నారు. ఎంతో ప్రాధాన్యం కలిగిన ఈమార్కెట్‌కు నిత్యం గోదావరి జిల్లాల నుంచే కాకుండా తెలంగాణ, ఒడిసా, పశ్చిమబంగా ప్రాంతాల నుంచి కూరగాయలు ఎగుమతి, దిగుమతులు జరుగుతూ ఉంటాయి. రైతులు పండించిన పంటలతో పాటు కొనుగోలుచేసిన వ్యాపారులు వాహనాలపై తీసుకెళుతుంటారు. ఇప్పటికైనా నేషనల్ హైవే అధికారులు స్పందించి మార్కెట్ ఎదురుగా రాకపోకలు డివైడర్ సౌకర్యం కల్పించాలని కూరగాయల రైతులు, వ్యాపారులు కోరుతున్నారు.

డివైడర్ ఏర్పాటుకు చర్యలు తీసుకోవాలి

అంతర్‌రాష్ట్ర కూరగాయల మార్కెట్ కమిటీ



మాజీ చైర్మన్ దొండపాటి సుబ్బరాజు

ఎంతో ప్రాధాన్యం కలిగిన మడికి అంతర్రాష్ట్ర కూరగాయల మార్కెట్‌కు వందలాది వాహనాల రాకపోకలు జరుగుతాయి. ముఖ్యంగా ఉదయం, సాయంత్రం మార్కెట్ జరుగుతున్న సమయాల్లో రైతులు త్వరగా మార్కెట్‌కు చేరుకోవాలనే ఉద్దేశంతో ఎదురుగా వచ్చేయడం వల్ల ప్రమాదాలు జరుగుతున్నాయి. ప్రమాదాల నివారణకు తక్షణం డివైడర్ ఏర్పాటు చేయాలి.

కొత్తపేట ఆర్ఐగా రవిశంకర్

కొత్తపేట, అక్టోబరు 27(ఆంధ్రజ్యోతి): కొత్తపేట రెవెన్యూ ఇన్‌స్పెక్టర్‌గా రవిశంకర్ బాధ్యతలు చేపట్టారు. ఈయన రావులపాలెం నుంచి బదిలీ అయి పదోన్నతిపై కొత్తపేట తహశీల్దార్ కార్యాలయానికి విచ్చేశారు.

నేడు భారీ రక్తదాన శిబిరం

కొత్తపేట, అక్టోబరు 27(ఆంధ్రజ్యోతి): సోమవారం కొత్తపేట ప్రభుత్వాసుపత్రి వద్ద పోలీసు సంస్మరణ దినోత్సవాన్ని పురస్కరించుకుని భారీ రక్తదాన శిబిరం ఏర్పాటు చేశారు. ముఖ్య అతిథులుగా ఎమ్మెల్యే బండారు సత్యానందరావు, జిల్లా ఎస్పీ బి.కృష్ణారావు హాజరవుతారని ఎస్ఐ సురేంద్ర తెలిపారు.

శివలింగ రక్షణ చర్యలు ప్రారంభం

రామచంద్రపురం(ద్రాక్షారామ), అక్టోబరు 27(ఆంధ్రజ్యోతి): రామచంద్రపురం అగస్త్యేశ్వరస్వామివారి ఆలయంలో ఆదివారం స్వామివారి మూలవిరాట్ రక్షణ చర్యలు ప్రారంభించారు. అందుకు శివాలయాన్ని మూసివేశారు. గర్భాలయంలో శివలింగం రక్షణ చర్యలను ఈవో లక్ష్మణ్ కార్యక్రమాన్ని పర్యవేక్షించారు.

ఘనంగా అన్నసమారాధన

రావులపాలెం, అక్టోబరు 27 (ఆంధ్రజ్యోతి): ఈతకోట జాతీయ రహదారి చెంతనే ఉన్న శ్రీకనకదుర్గమ్మ అమ్మవారి ఆలయ వద్ద ఆలయ కమిటీ ఆధ్వర్యంలో అన్నసమారాధన నిర్వహించారు. దేవీశరన్నవరాత్రులు అనంతరం అమ్మవారికి ఆదివారం పూజలుచేసి అనంతరం అన్నసమారాధన నిర్వహించారు. భక్తులు అన్నప్రసాదాన్ని స్వీకరించారు.

కార్యకర్తలకు అండగా ఉండేది టీడీపీ



సభ్యత్వ నమోదు ప్రారంభిస్తున్న కాకినాడ రామారావు

రామచంద్రపురం(ద్రాక్షారామ), అక్టోబరు 27(ఆంధ్రజ్యోతి): తెలుగుదేశం పార్టీ కార్యకర్తలకు అండగా ఉంటుందని నియోజకవర్గ పరిశీలకుడు, రజక చైతన్యసంస్థ రాష్ట్ర అధ్యక్షుడు కాకినాడ రామారావు అన్నారు. శనివారం రాత్రి రామచంద్రపురం పట్టణం బ్రాడీపేటలో టీడీపీ సభ్యత్వాల నమోదు కార్యక్రమాన్ని కాకినాడ రామారావు ప్రారంభించారు. రాష్ట్రాన్ని సీఎం చంద్రబాబు దేశంలో నెం-1 స్థానంలో నిలిపేందుకు కృషి చేస్తున్నారన్నారు. నియోజకవర్గ అభివృద్ధికి మంత్రి సుభాష్ ప్రణాళికతో ముందుకు వెళుతున్నారని అన్నారు. కార్యకర్తలకు భరోసా కల్పించేందుకు బీమా సౌకర్యం కల్పిస్తామన్నారు. రజకులు అందరూ పార్టీ సభ్యత్వాలు తీసుకోవాలని కోరారు. రజకులకు సభ్యత్వాలు అందజేశారు. రజక కమిటీ సభ్యులు కార్యక్రమంలో పాల్గొన్నారు.

సీఎంతో జీఎన్ నాయుడు భేటీ

యానాం, అక్టోబరు 27(ఆంధ్రజ్యోతి): యానాంలో రీజెన్సీ పరిశ్రమకు సంబంధించిన పలు పెండింగ్ అంశాలపై పుదుచ్చేరి ముఖ్యమంత్రి ఎన్.రంగసామితో రీజెన్సీ సంస్థల చైర్మన్ డాక్టర్ జీఎన్ నాయుడు సమావేశమయ్యారు. ఈమేరకు అసెంబ్లీలోని సీఎం కార్యాలయానికి వెళ్లారు. ముఖ్యంగా రీజెన్సీకి సహజ వాయువు సరఫరా అంశంతో పాటు పెండింగ్‌లో ఉన్న అన్ని అంశాలను పరిష్కరించాలని సీఎంను కోరారు. దీనిపై సీఎం స్పందించి అత్యున్నత స్థాయి సమావేశాన్ని నిర్వహించి అన్ని సమస్యలను పరిష్కరించేలా కృషి చేస్తానని సీఎం తెలిపినట్లు నాయుడు తెలిపారు. రీజెన్సీ సంస్థల మేనేజింగ్ డైరెక్టర్ డాక్టర్ ఎన్.సత్యేంద్రప్రసాద్ పాల్గొన్నారు.

రూ.50వేలు విరాళం

అంతర్వేది, అక్టోబరు 27(ఆంధ్రజ్యోతి): అంతర్వేది శ్రీలక్ష్మీనరసింహస్వామివారి ఆలయంలో నిర్వహించే శ్రీనారసింహ సుదర్శన హోమానికి సంవత్సరానికి రూ.40వేలు, ఆరు నెలలు నిత్య అభిషేకానికి రూ.10వేలును కోరుకొండకు చెందిన పుల్లెపు త్రిమూర్తులు ఆదివారం విరాళాన్ని సహాయ కమిషనర్‌కు అందించారు.

నరేంద్రపురంలో చోరీ

పి.గన్నవరం, అక్టోబరు 27(ఆంధ్రజ్యోతి): తాళం వేసిన ఇంటిలో చోరీ జరిగింది. నరేంద్రపురానికి చెందిన విశ్రాంత పోస్టు మాస్టర్ గరిమెళ్ల సీతారామశర్మ సోదరుడుమల్లి కార్జునరావు ఇంట్లో నివాసం ఉంటున్నారు. అయితే ఆయన ఇంటికి తాళం వేసి ఇటీవల హైదరాబాదు వెళ్లారు. ఇంటి ఎదురుగా ఉంటున్న సీతారా మశర్మ మరోసోదరుడు వెంకటసూర్యసుబ్రహ్మణ్యం ఆదివారం ఉదయం ఇంటి తాళాలు పగలుగొట్టి ఉండటాన్ని గమనించారు. వెంటనే ఆయన సోదరుడికి సమాచారం అందించడంతో పాటు పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఎస్ఐ బి.శివకృష్ణ ఆధ్వర్యంలో చోరీకి గురైన ప్రాంతాన్ని క్లూస్ టీమ్‌తో పరిశీలన చేశారు. బీరువాలో ఉంచిన 425గ్రాముల వెండి వస్తువులు గుర్తుతెలియని వ్యక్తులు చోరీ చేసినట్లు గుర్తించారు. కేసు నమోదుచేసినట్లు ఎస్ఐ తెలిపారు.

పిచ్చికుక్క దాడి గేదెలకు గాయాలు

అల్లవరం అక్టోబరు 27(ఆంధ్రజ్యోతి): కొమరగిరిపట్నంలో ఆదివారం పిచ్చికుక్క దాడిలో ఆరు పాడి గేదెలు గాయాల పాలయ్యాయి. పిచ్చికుక్క స్వైర విహారం చేసి పాడి గేదెలను కరవడంతో పాడి రైతులు తీవ్ర ఆందోళనకు గురయ్యారు. దీనిపై సమాచారం అందుకున్న గోడి పశు సంవర్ధక శాఖ అసిస్టెంట్ వినయ్ వెళ్లి గేదెలను వ్యాక్సిన్ వేశారని మండల పశువైద్యాధికారి డాక్టర్ మేడిద నారాయణరావు తెలిపారు.



రావులపాలెం మండలంలో ఈనిక దశలో ఉన్న వరిపంట పొలాలు

వాతావరణ మార్పులతో అన్నదాత ఆందోళన

రావులపాలెం, అక్టోబరు 27 (ఆంధ్రజ్యోతి): వరి పంట పొలాలు ఈనిక దశలో ఉన్న తరుణంలో వాతావరణంలో మార్పులు చోటు చేసుకోవడంతో అన్నదాతలు ఆందోళన చెందుతున్నారు. మండలంలో ప్రస్తుత ఖరీఫ్ సీజన్‌లో స్వర్ణ, 1318 రకాల వరి వంగడాలను రైతులు సాగు చేశారు. స్వర్ణ రకం ఈనిక పూర్తి చేసుకుని పాలు పోసుకునే దశలో ఉండగా 1318 రకం ఈనిక దశలో ఉంది. ఇటువంటి తరుణంలో గాలులు, వర్షం గాని పడితే పంట పొలాలు నేలకు వరిగి దిగుబడి తగ్గిపోయే ప్రమాదం ఉందని రైతులు ఆందోళన చెందుతున్నారు. వాతావరణ మార్పుల కారణంగా వరిపైరును తెగుళ్ల ఆశించే అవకాశం ఉందని పలువురు ఆందోళన చెందుతున్నారు. దీంతో సస్యరక్షణ చర్యల కోసం పెట్టుబడుల భారం మరింత పెరిగే అవకాశం ఉందని రైతులు ఆవేదన చెందుతున్నారు.

పోలీసు సిబ్బంది రక్తదానం

రామచంద్రపురం(ద్రాక్షారామ), అక్టోబరు 27 (ఆంధ్రజ్యోతి): పోలీసుల సంస్మరణ దినోత్సవాన్ని పురస్కరించుకుని ఆదివారం 32మంది పోలీసులు రక్తదానం చేశారు. రామచంద్రపురం ఏరియా ఆసుపత్రిలో బ్లడ్ బ్యాంకులో రక్తదాన శిబిరాన్ని డీఎస్పీ బి.రామకృష్ణ ప్రారంభించారు. రామచంద్రపురం సీఐ కె.అశోక్‌కుమార్, రామచంద్రపురం సబ్‌డివిజన్‌లో పలువురు పోలీసులు, సిబ్బంది 32మంది రక్తదానం చేశారు. కార్యక్రమంలో ఏరియా ఆసుపత్రి బ్లడ్ బ్యాంకు వైద్యులు, సిబ్బంది పాల్గొన్నారు.



రక్తదానం చేస్తున్న సీఐ అశోక్‌కుమార్

నగర పంచాయతీ కార్యాలయం ఎదుట ధర్నా

ముమ్మిడివరం, అక్టోబరు 27(ఆంధ్రజ్యోతి): సమస్యలు పరిష్కరించాలని కోరుతూ సీఐటీయూ ఆధ్వర్యంలో నగర పంచాయతీ కార్మికులంతా ముమ్మిడివరం కార్యాలయం ఎదుట ఆదివారం ధర్నా నిర్వహించారు. పట్టణాల విస్తరణ మేరకు కార్మికుల సంఖ్య పెంచాలని, పనిముట్లు, రక్షణ పరికరాలు, సౌకర్యాలు కల్పించాలని డిమాండు చేశారు. అనంతరం వినతిపత్రాన్ని చైర్మన్ కమిడి ప్రవీణ్‌కుమార్‌కు అందజేశారు. కూటమి ప్రభుత్వం వెంటనే కార్మికుల డిమాండ్లు పరిష్కరించాలని వారు కోరారు. కార్యక్రమంలో నిమ్మకాయల వెంకటేష్, బుంగ కుమార్, ఎం.భార్గవరాజు, మాణిక్యం, కొండయ్య, బి.లక్ష్మణ్, పి.నాగలక్ష్మి పాల్గొన్నారు.



దర్గా వద్ద చందనోత్సవం దృశ్యం

ఘనంగా ఉరుసు చందనోత్సవం

రామచంద్రపురం(ద్రాక్షారామ), అక్టోబరు 27(ఆంధ్రజ్యోతి): స్థానిక వీఎస్ఎం కళాశాల వద్ద గల హజరత్ మెహబూబ్ సుభహాని దర్గా వద్ద 22వ ఉరుసు చందనోత్సవం ఆదివారం ఘనంగా జరిగింది. తొలుత చందనంతో పట్టణంలో మెయిన్‌రోడ్డులో ఊరేగింపు నిర్వహించారు. దర్గా వద్దకు చేరుకుని ప్రత్యేక పూజలు చేశారు. పట్టణం, ఇతర ప్రాంతాలకు చెందిన అధికసంఖ్యలో భక్తులు పాల్గొన్నారు. దర్గా కమిటీ ఆధ్వర్యంలో భక్తులకు భోజన వసతి కల్పించారు.

చెకుముకి సంబరాలు

మలికిపురం, అక్టోబరు 27(ఆంధ్రజ్యోతి): మలికిపురంలో నిర్వహించిన జిల్లాస్థాయి చెకుముకి పోటీల్లో ప్రభుత్వ పాఠశాల విభాగం నుంచి వానపల్లి జిల్లాపరిషత్ ఉన్నత పాఠశాల ప్రథమ స్థానంలో నిలవగా ప్రైవేటు పాఠశాలల నుంచి కొత్తపేట భాష్యం స్కూల్ జిల్లా స్థాయిలో ప్రథమ స్థాయిలో నిలిచి రాష్ట్రస్థాయి పోటీలకు అర్హత సాధించింది. ఈపోటీల్లో జిల్లా నలుమూలల నుంచి ప్రభుత్వ, ప్రైవేటు పాఠశాలల నుంచి 50బృందాలు పాల్గొన్నాయి. విజేతలు రాష్ట్రస్థాయిలో విశాఖపట్నంలోజరిగే పోటీల్లో పాల్గొంటారు. జిల్లా సైన్స్ ఆఫీసర్ జీవీఎస్ సుబ్రహ్మణ్యం, కరస్పాండెంట్ ఎంవీ సత్యనారాయణ, మలికిపురం ఎంఈవోలు ఎం.విజయశ్రీ, వైవీసత్యనారాయణ పాల్గొన్నారు.

ముమ్మిడివరంలో భారీ వర్షం

ముమ్మిడివరం, అక్టోబరు 27(ఆంధ్రజ్యోతి): ముమ్మిడివరంలో ఆదివారం మధ్యాహ్నం భారీ వర్షం కురిసింది. ఆకాశం ఒక్కసారిగా మేఘావృతమై మధ్యాహ్నం 3.30 నుంచి 5 గంటల వరకు ఏకధాటిగా వర్షం కురవడంతో రోడ్లన్నీ నీట మునిగాయి. దీంతో ఎక్కడ వాహనాలు అక్కడే నిలిచిపోయాయి. పట్టణంలో డ్రైనేజీ వ్యవస్థ సక్రమంగా లేకపోవడంతో నీరు బయటకు వెళ్లే మార్గం లేక ఎక్కడనీరు అక్కడే రోడ్డుపై నిలబడిపోయింది. దీంతో రోడ్లన్నీ చెరువును తలపించాయి. ముమ్మిడివరంలో ఆసుపత్రుల వీధి, టెలిఫోన్ ఎక్స్ఛేంజ్‌వీధి, కుమ్మరివీధి, బాలాజీకాన్వెంట్ వీధి, గంటావారి వీధి, తహసీల్దార్, పోలీసుస్టేషన్, సబ్‌ట్రెజరీ కార్యాలయాల ఆవరణ నీట మునిగాయి. భారీ వర్షానికి మురుగునీటి కాల్వలు, పంటకాల్వలు పొంగి ప్రవహించాయి. పలు కాలనీలు, జగనన్న కాలనీల్లోని అంతర్గత రోడ్లు, లోతట్టు ప్రాంతాలు వర్షం నీటితో మునిగాయి.




ఆత్రేయపురం-ఉచ్చిలి రహదారి. పక్క చిత్రంలో పులిదిండి-వెలిచేరు రహదారి

అధ్వానంగా గ్రామీణ రహదారులు

ఆత్రేయపురం, అక్టోబరు 27(ఆంధ్రజ్యోతి): గ్రామీణ రహదారులు అధ్వానంగా మారాయి. ఆ రహదారులపై ప్రయాణించాలంటేనే నరకప్రాయంగా మారింది. రైతుల పంటలు మార్కెట్‌కు తరలించాలంటే నరకప్రాయంగా మారుతోంది. ఆత్రేయపురం నుంచి ఉచ్చిలి వెళ్లే పంత రోడ్డు కొద్దిపాటి వర్షాలకు బురదమయంగా మారిపోతోంది. పులిదిండి నుంచి వెలిచేరు వెళ్లే ఆర్‌అండ్‌బీ రహదారిపై పెద్దపెద్ద గోతులు పడి ఛిద్రమైంది. పంత రోడ్ల పరిస్థితి దయనీయంగా మారింది. వాహనదారులు, రైతులు పడరాని పాట్లు పడుతున్నారు. ఈ రోడ్లకు తాత్కాలిక మరమ్మతులు చేపట్టి ప్రమాదాలు నివారించాల్సిన అధికార యంత్రాగం చోద్యం చూస్తోందని పలువురు ఆరోపిస్తున్నారు. ఇప్పటికైన అధ్వాన స్థితిలో ఉన్న పంతరోడ్లను పటిష్టం చేయాల్సిన బాధ్యత కూటమి ప్రభుత్వంపై ఉందని పలువురు వ్యాఖ్యానిస్తున్నారు.

గంటి గ్రామంలో 108లో ప్రసవం

కొత్తపేట, అక్టోబరు 27(ఆంధ్రజ్యోతి): గంటి గ్రామానికి చెందిన కడలి కృష్ణకుమారికి ప్రసవ నొప్పులు అధికమవ్వడంతో బంధువులు 108కు కాల్ చేశారు. ఆమెను 108లో సిబ్బంది ఆసుపత్రికి తరలిస్తుండగా పురుటి నొప్పులు అధికమవ్వడంతో టెక్నీషియన్ గూడపాటి నాగరాజు డెలివరీ చేయగా మగ శిశువు జన్మించాడు. శిశువు ఎదురుకాళ్లతో మెడకు పేగు చుట్టుకుని జన్మించడంతో టెక్నీషియన్ సమయస్ఫూర్తితో ప్రసవం జరిగేలా చేశాడు. దీంతో తల్లీ బిడ్డను వైద్యం కోసం కొత్తపేట ప్రభుత్వాసుపత్రికి తరలించారు. కార్యక్రమంలో 108 సిబ్బంది, ఈఎంటీ గూడపాటి నాగరాజు, పైలెట్ కుంచే ప్రదీప్ తదితరులు పాల్గొన్నారు.



కొత్తపేట మండలం గంటి గ్రామంలో 108లో ప్రసవం జరిగిన దృశ్యం



కోటిపల్లి ఏటిగట్టు రోడ్డును చదును చేయిస్తున్న టీడీపీ నాయకులు

ఏటిగట్టు రోడ్డులో గుంతలు పూడ్చివేత

కె.గంగవరం, అక్టోబరు 27(ఆంధ్రజ్యోతి): జొన్నాడ - యానాం ఏటిగట్టు రహదారి కోటిపల్లి వద్ద అధ్వానంగా తయారైంది. పెద్దపెద్ద గోతులు ఏర్పడి వాహనాదారులకు ఇబ్బందిగా మారింది. ఒక్కోసారి ఈ గోతుల్లో కార్లు నిలిచిపోవడంతో పాటు పాడయ్యేవి. ఇక్కడి పరిస్థితిని కోటిపల్లి టీడీపీ నాయకులు, సుభాష్ సేవా సమితి సభ్యులు కార్మికశాఖ మంత్రి వాసంశెట్టి సుభాష్‌కు వివరించి సమస్య తీవ్రతను తెలిపారు. మంత్రి స్పందించి గోతులను జేసీబీతో చదును చేయించారు. 20 ట్రాక్టర్ల క్వారీ డస్టువేసి రహదారికి మరమ్మతులు చేయించారు. వీటిని సుభాష్ సేవా సమితి సభ్యులు పర్యవేక్షణలో పనులు చేశారు. సమస్య పరిష్కారానికి కృషి చేసిన మంత్రిని సేవా సమితి సభ్యులను, గ్రామస్తులు అభినందించారు.

రహదారుల మరమ్మతులకు నిధులు మంజూరు

ఎమ్మెల్యే వేగుళ్ల

మండపేట, అక్టోబరు 27(ఆంధ్రజ్యోతి): నియోజకవర్గంలో గత ప్రభుత్వ నిర్వాకం, భారీ వర్షాలకు దెబ్బతిన్న రహదారుల మరమ్మతులకు కూటమి ప్రభుత్వం రూ.4.3 కోట్ల నిధులను విడుదల చేసిందని ఎమ్మెల్యే వేగుళ్ల జోగేశ్వరరావు చెప్పారు. వర్షాలు తగ్గిన వెంటనే నియోజకవర్గంలోని రోడ్లకు మరమ్మతులు చేపడతామని ఆదివారం ఒక ప్రకటనలో ఆయన తెలిపారు.

విజయదుర్గా పీఠంలో మాజీ ఎంపీ భరత్ పూజలు



పీఠంలో పీఠాధిపతి గాడ్‌తో మాజీ ఎంపీ భరత్

రాయవరం, అక్టోబరు 27(ఆంధ్రజ్యోతి): వెదురుపాక విజయదుర్గా పీఠంలో ఆదివారం మాజీ ఎంపీ మార్గాని భరత్ పూజలు చేశారు. విజయదుర్గా అమ్మవారికి అర్చన, హారతులు నిర్వహించిన అనంతరం పీఠం వేదపండితుల వేదాశీర్వచనం అందజేశారు. పీఠాధిపతి గాడ్ ఆశీస్సులు పొందడం ఆనందంగా ఉందన్నారు. ఆయన వెంట విజయదుర్గా సేవా సమితి ప్రతినిధులు గాదే భాస్కరనారాయణ, సత్యవెంకట కామేశ్వరి, పెదపాటి శ్రీనివాసమూర్తి, సత్యకనకదుర్గ తదితరులు ఉన్నారు.